# మిసిమి

మార్చి - 2000

వెల - రూ॥ 8/-

మాస పత్రిక





ఫ్రాన్స్‌హాల్స్

## చిత్రకారుని గురించి ( 1582-1666)

వ్యక్తులను, ముఖ్యంగా వారి ముఖాలను చిత్రించే పదిహేడవ శతాబ్ది చిత్రకారులలో కెల్ల అగ్రగణ్యుడు ఫ్రాన్స్‌హాల్స్. ఇతడు 1582/3 యాంటివర్ప్, హాలెండ్‌లో జన్మించాడు. ఇతడు శైశవంలోనే (1585) ఇతని కుటుంబం హార్‌లెమ్‌కు వలస పోయింది. ఇక్కడే హాల్స్ తన జీవితం అంతా గడిపాడు. ఇక్కడ అతడు, స్థానికంగా ముందుకొచ్చి, పెయింటింగ్ కోసం కూర్చొనే (Sitters) వ్యక్తులనే చిత్రించాడు. ఈ సిటర్స్‌లో చాల మంది అత్యంత ప్రతిష్ఠనార్జించిన వారున్నారు.

ఇతడు వాన్‌డిక్ లాగ యాత్రలు చేసేవాడు కాదు. ఇటాలియన్ మాస్టర్ పెయింటర్స్‌ను అనుకరించాలని ఇతనికి ఉండేది కాదు. అతని శైలి ఎవరికీ సంబంధం లేనిది. వాస్తవానికి అతడు స్వయంగానే పెయింటింగ్ నేర్చుకొన్నాడు. ఎవరిదగ్గర నేర్చుకోలేదు. ఇతని పెయింటింగ్స్‌లోని స్థానిక లక్షణం మామూలు డచ్ చిత్రకళ నుంచి విచలించింది. దీనితో వేరే డచ్ చిత్రకళా సంప్రదాయం ఒకటి రూపు దిద్దుకొంది. ఇతడు గొప్ప చిత్రకారుడే కాని మహాదారిద్ర్యం అతనిని వెన్నాడుతుండేది. చని పోయే టప్పుడు అతని దగ్గర ఎర్రని ఏగాని లేదు.

హాల్స్ చిత్రాలలో అయత్నత (spontaneity) కనిపిస్తుంది. ఒక ప్రభావక శక్తి కనిపిస్తుంది. ఈ రెండూ సిటర్స్‌కు, వారికి లేని జీవాన్ని పోస్తాయి. వాళ్ళ మూర్తి మత్వాలకు సంబంధించి ఒక విస్పష్ట ముద్రను మన మీద వేస్తాయి.

### ముఖచిత్రం : దంపతులు

ఈ చిత్రంలోని వ్యక్తులు బహుశ వ్యాపారి, నావికా యాత్రికుడు అయిన ఐజాక్ మసా, అతని మొదటి భార్య బియాట్రిక్స్ వాన్‌డెర్ లెన్‌లు అయి ఉండవచ్చు. మసా రెండు సార్లు హాల్స్‌తో తన చిత్రాన్ని పెయింట్ చేయించు కొన్నాడు. ఈ చిత్రం ఆ దంపతులు 25 ఏప్రిల్ 1622న పెళ్ళిపండుగ జరుపు కోవడానికి బహుశ చిత్రించి ఉండ వచ్చు. ఇది ఖచ్చితంగా పెళ్ళి చిత్రమే. ఎందుకంటే, ఇందులోని స్త్రీ చూపుడు వ్రేలికి ఉంగరం కనిపిస్తున్నది. ఆ రోజుల్లో చూపుడు వ్రేలికి ఉంగరం తొడగడం ఫ్యాషన్.

లాన్ మీది ఇతరుల నుంచి ఆదంపతులు ఏకాంతం కోసం కొంచెం రహస్య స్థలానికి జరిగినట్లు కనిపిస్తుంది. ఆ స్త్రీ పెదవుల మీదనునుసిగ్గు తెరల దరహాసం, ఆమె ప్రదర్శించే ప్రేమపూరిత వాత్సల్యం అతని పెయింటింగ్‌లోని ప్రసాద గుణాన్ని కొట్ట వచ్చి నట్లుగా ప్రదర్శిస్తుంది.

### నాలుగో అట్టమీద చిత్రం : కపాలంతో ఉన్న యువకుడు

ఈ చిత్రాన్ని చూసిన వారు తరుచు షేక్స్‌పియర్ హామ్లెట్‌యోరిక్‌మరణం మీద ఏకాంత అంతర్మథనాన్ని చూపిస్తుందని భావిస్తారు. బహుశ ఇది వేనిటా ప్రతిమ కావచ్చు. మనిషి ఇహలోక జీవితం ఎంత అనిత్యమో చెప్పడానికి ఇది ఉద్దేశింప బడి ఉండ వచ్చు. ఇక్కడ పుర్రె మృత్యుచిహ్నం. ఈ మృత్యు చిహ్నాన్ని ధిక్కరించే వీర్య, యౌవనాలు చిత్రానికి ముగ్ధతను చేకూరుస్తున్నాయి.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 12 | మార్చి 2000 | సంచిక 3

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయసూచిక


ప్రవచనం - బి. తిరుపతిరావు

సబాల్టర్నిజం : ''ఉపశ్రేణివాదం'' - గూడ శ్రీరాములు

హృదయ సమస్యలను విప్పేదే సాహిత్యం - బి.వి. రామిరెడ్డి

21వ శతాబ్దంలో తెలుగు కథ - డా॥ దేవరాజు మహారాజు

''వజ్రసూచి - వివరణ'' - టి. రవిచంద్

మహాప్రజ్ఞానిధి ఆశుతోష్ ముఖర్జీ - డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

కవిత్వము - ప్రక్రియ - డా॥ యు. ఎ. నరసింహమూర్తి



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **దంపతులు**

**Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536**
**e-mail : misimi_m@hotmail.com**
**http : //www.misimi.com**

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# Form IV (SEE RULE 8)

## Statement about ownership and other Particualrs of MISIMI

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | ALAPATI BAPANNA |
| Whether citizen of India | : | Yes |
| If foreigners, state the country of origin | : | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 4. Publisher's Name | : | ALAPATI BAPANNA |
| Whether citizen of India | | |
| If foreigners, state the country of origin | | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 5. Editor's Name | : | ANNAPA REDDY VENKATESWARA REDDY |
| Whether citizen of India | : | Yes |
| If foreigners, state the country of origin | | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital | : | ALAPATI BAPANNA 337-A, Road No. 10, Jubilee Hills, Hyderabad - 500 034. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**ALAPATI BAPANNA**
Publisher

Date : March 1, 2000

# ప్రవచనం (Discourse)

**- బి. తిరుపతిరావు**

ప్రవచనం (Discourse) : విమర్శనా సిద్ధాంతం, సామాజిక శాస్త్రం, బాషా శాస్త్రం, తత్వ శాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రం లాంటి రంగాలలో ఈమధ్య ప్రవచనం అనే పదం చాలా విరివిగా వాడటం జరుగుతోంది. సాహిత్య, సాంస్కృతిక విశ్లేషణల్లో కూడా ప్రవచనం అనే పదాన్ని తరచుగా వాడటం జరుగుతోంది. పదహారవ శతాబ్దం నుంచి ఈ పదం ( నిజానికి పద్నాల్గోవ శతాబ్దంలోనే 'డిస్కర్సస్' అనే పదాన్ని 'వాదన' అనే అర్థంలో వాడటం జరిగింది) 'ఉపన్యాసం', 'భాషణం', 'సంభాషణం' అనే పదాలకి ప్రత్యామ్నాయంగా వాడటం జరిగింది. ఆ తరువాత క్రమంగా 'ప్రవచనం' అనే పదాన్ని ఒక నియమబద్ధ ఉపన్యాసాన్ని, కథనాన్ని, తాత్విక, మత ప్రతిపాదనల్ని సూచించడానికి వాడబడింది. అయితే చాలా నిఘంటువులు ప్రవచనాన్ని ఒక మౌఖిక సందేశంగా, సంభాషణగా, క్రమబద్ధతతో నిండిన ఉపన్యాసంగా మాత్రమే చూశాయి. అయితే ఇవి ప్రవచనానికి పరిమిత అర్థాలు మాత్రమే.

నిజానికి ప్రవచనం అనేది కొన్ని అర్థాల, రూపకాల ప్రాతినిధ్యాల, ప్రతిమల, కథల, ప్రకటనల సమూహాల్ని సూచిస్తుంది. అలాగే సంఘటనలకి సంబంధించిన ప్రత్యేక వివరణల్ని లేక వాఙ్మాలాల్ని (Versions) సూచిస్తుంది. ఒక అంశానికి చెందిన ప్రవచనం వాచకంగా చూడబడుతుంది. ప్రవచనం మౌఖికంగా ఉపన్యాసం, సంభాషణ, ఇంటర్వ్యూలాంటి రూపాల్లోనూ, లిఖిత రూపంలో నవల, కథ, నాటకం, వ్యాసాలు, లేఖలు, ప్రకటనలు, సినిమాలు మొదలైన వాటి రూపంలో వుంటుంది. మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే మనుష్యులు దరించే బట్టలలో కూడా ప్రవచనాలు వ్యక్తమౌతాయి. ప్రతి వ్యక్తీకరణని ( అది లిఖిత రూపంలో వున్నా, మౌఖిక రూపంలో వున్నా) ఒక వాచకంగా పరిగణించాలి. అలాగే ప్రతి వాచకాన్ని ఒక ప్రవచనాన్ని ఆవిష్కరించేదిగా చూడాలి. ఉదాహరణకి ఒక గొప్ప భవనాన్ని పౌరసమాజంలో ఒకానొక ప్రతిష్టకు సంబంధించిన అంశాన్ని ఆవిష్కరించే ప్రవచనంగా చూడవచ్చు. అలాగే బట్టలు, యూనిఫాంలు ఒక వర్గ స్థితిని, స్థాయిని, లింగాన్ని, వయస్సుని, సంస్కృతిని ఆవిష్కరించే ప్రవచనాలుగా వుంటాయి. అందువల్ల ప్రవచనాల్ని ముందుకు తీసుకురాని అంశం, సంఘటన అనేవి సమాజంలో వుండవు.

సమాజంలో వ్యక్తి గుర్తింపులు కూడా ప్రవచనాల ఫలితంగానే రూపొందుతాయి. గుర్తింపులు వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాల ఫలితాలు. ఈ సంబంధాలు భాష మీద ఆధారపడి వుంటాయి. భాష ఆవిష్కరించేది అంతిమంగా ప్రవచనాల్నే. కాబట్టే గుర్తింపులు ఏర్పడటానికి ప్రవచనానికి విడదీయలేని సంబంధం వుంది. గుర్తింపు ఏర్పడటంలో అనేక అంశాలు పోగులుగా వుండటం జరుగుతుంది. శిశువు, యువతి, యువకులు, ముసలివాళ్ళు అనేవన్నీ వయస్సుకు సంబంధించిన పోగు (thread). వృత్తి, ఆదాయం, విద్యాస్థాయి అనేవి వర్గానికి సంబంధించిన పోగు. అలాగే జాతి, కులం, లింగం అనేవికూడా వివిధమైన పోగులు. ఈ పోగులన్నీ కలసి వ్యక్తి గుర్తింపు అనే వస్త్రాన్ని

అస్తిత్వంలోకి తెస్తాయి. సారాంశంలో ఈ పోగులన్నీ వయస్సు, జండర్, విద్యా, లైంగికత అనే ప్రవచనాలుగా నిర్మితమౌతాయి.

వ్యక్తి గుర్తింపుల్ని రూపొందించే ప్రవచనాలు అంతిమంగా ఒక వ్యక్తి ఏ పనులు చేయవచ్చు, ఏ ఆలోచనలు చేయవచ్చు, వేటిని చేయకూడదు అనే వాటిని నిర్దేసించే స్థాయిలో వుంటాయి. ప్రవచనాలు అమూర్త భావాలు కాదు. సమాజాన్ని వ్యవస్థాపించే విధానానికి, నడిపే విదానికి ప్రవచనాలకి గాఢ సంబంధం వుంటుంది. చట్టం, విద్య, పెళ్ళి, కుటుంబం, గుడి అనేవి వ్యక్తి రోజువారీ జీవితానికి రూపాన్ని, సారాన్ని ఇస్తాయి. ఇవే సాంఘిక స్థాయి రూపొందటానికి కారకమౌతాయి. రోజువారీ జీవిత విధానంలో వ్యక్తి స్థాయిని బట్టి కొన్ని కొన్ని ప్రవచనాలు అధికారాన్ని అనుభవించేవిగా, అమలు చేసేవిగా, సత్యాన్ని ఆవిష్కరించేవిగా వుంటాయి. ఉదాహరణకి మగవాడి జీవిత విధానం, స్థాయి పురుష ప్రవచనానికి విశేష అధికారాన్ని, సాధికారీకతని సంతరించి పెడుతుంది.

సాంఘిక నిర్మాణాల్ని, సామాజిక ఆచరణల్ని, ప్రవచనాల్ని, వాటిమధ్య వున్న గాఢ సంబంధాన్ని దగ్గరగా పరిశీలించినట్లయితే కొన్ని ప్రవచనాలకి విశేష అధికారం, కొన్నింటికి ఏమాత్రం అధికారం లేకపోవటం కన్పిస్తుంది. అందువల్ల తేలేదేమంటే సత్యం, అసత్యం, వాస్తవం, అవాస్తవం, అనే విభజనలు వాటి వాటి అంతర్గత అంశాల్ని కేంద్రం చేసుకొని విశ్లేషించబడటం కాక ఆవిషయాల్ని ప్రవచిస్తున్న వ్యక్తుల సామాజిక స్థాయిని బట్టి జరుగుతూ వుంటుంది. మనిషి చేతనలోకి వచ్చే అన్ని వస్తువులు, అన్ని భావాలు, గుర్తింపులు, అహాలు, భాషా నిర్మితాలు, ప్రవచన రూపకల్పనలు.

భాష, ప్రవచనానికి మధ్య విడదీయరాని సంబంధం వున్నప్పటికీ రెండూ ఒకటికాదు. భాషలో మనిషి ప్రపంచానికి సంబంధించిన అంశాల్ని లౌకిక జ్ఞానంతో అవగతం చేసుకోవటం జరుగుతుంది. ఈ స్థితిలో భాషకి, అర్థానికి, ప్రపంచానికి మధ్య వున్న సంబంధాన్ని గురించిన మనిషిలో ప్రశ్నలు తలెత్తవు. వాటిని చాలా ఉదాసీనంగా గ్రహిస్తాడు. ప్రవచన ప్రపంచం ఇందుకు పూర్తి విరుద్ధం. ప్రవచనాలు చాలా చేతనాపూరితంగా నిర్మించబడతాయి. చాలా సందర్భాలలో భాష అలీనంగా, పారదర్శకంగా వుంటూ ప్రపంచాన్ని వర్ణిస్తుందని నమ్మటం జరుగుతుంది. అయితే అది సరికాదు. 1960ల తరువాత వచ్చిన చాలామంది తాత్వికులు ఈ విషయాన్నే రుజువు చేశారు. భాష, సామాజక, చారిత్రక సంఘటనలు విడదీయరానివిగా వుంటాయి. కొన్ని ప్రత్యేకస్థితులు ప్రత్యేక భాషని ముందుకు తెస్తాయి. ఆ క్రమంలో ఆ భాష ఆ సంఘటనల్ని నిర్దేసించే స్థాయికి చేరుతుంది. సామాజక సంబంధాల సముచ్చయం నుంచే రూపొందే భాష, నిర్దిష్ట స్థల, కాలాల్లో ముందుకు వచ్చే భాష ఎప్పుడూ అలీనంగా వుండదు. భావజాలాలకి అతీతంగానూ వుండదు. అందుకు భిన్నంగా కొన్ని ప్రయోజనాల్ని వుద్దేసించి రూపకల్పన చేయబడిన జ్ఞానంగా వుంటుంది. ఈ జ్ఞానం సహజంగా అధికారం, ఆధిపత్య లక్ష్యాలుగా పనిచేస్తుంది. ఈ స్థితిలో భాష రాజకీయ, సామాజక నియంత్రణకి సాధనంగా వుంటుంది. ఈ స్థితిలో భాషలో 'సత్యం' అనేది అఖండంగా, ఆదర్శప్రాయంగా కాక సాపేక్షికంగా వుంటుంది. సత్యం పేరుతో భాషలో ఆవిష్కరించబడేది ఒకానొక అధికారమే. 'సత్యాన్ని' ఉత్పత్తి చేయటం లేక రూపొందించటం ద్వారా తప్ప మరొకరకంగా మనం అధికారాన్ని ప్రయోగించలేం.

ప్రతి సాంఘిక వ్యవస్థ నుంచి రూపొందే ప్రవచనాలు ప్రతి సమాజాన్ని చుట్టుముట్టి వుంటాయి.

ఉదాహరణకి చట్ట, వైద్య, నైతిక వ్యవస్థలు రూపొందించే ప్రవచనాలు. ఈ ప్రవచనాలు వ్యక్తుల మీద ప్రయోగించే అధికారాన్ని గుర్తించిన స్పృహకూడా ఎక్కువ సందర్భాలలో వ్యక్తులకు అవగతంకాదు. ప్రతి ప్రవచనం మరొక ప్రవచనానికి విరుద్ధంగా వుంటూనో లేక ఐక్యతలో వుంటూనో పని చేస్తువుంటాయి. ఉదాహరణకి సైన్స్ - మతం, అలాగే జెండర్ - జాతికి సంబంధించిన ప్రవచనాలు. వీటిల్లో కొన్ని భావాలు, జాతులు ఉన్నతమైనవిగానూ మరికొన్ని నీచమైనవిగా ప్రకటించటం ప్రవచనాల ద్వారానే జరుగుతుంది. ఉదాహరణకి వైద్య శాస్త్ర ప్రవచనం. సాదారణ అర్థంలో మనం వైద్యశాస్త్రాన్ని జబ్బు మాన్పే లేక తగ్గించే రంగంగా చూస్తాం.

నిజానికి వైద్య శాస్త్రం చేసేది శరీరాల గురించి, జబ్బు గురించి ఇంకా ప్రపంచాన్ని గురించి చేసే కొన్ని ప్రకటనల చట్రానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ చట్రం జబ్బు తగ్గే క్రమాన్ని మనుష్యులు ఎలా చూస్తారు. మనుష్యులు భౌతిక శరీరానికి ప్రపంచానికి వున్న సంబంధం మొదలైన వాటిని నియంత్రిస్తుంది. ఈ నియంత్రణ క్రమంలో కొన్ని బహిష్కరణలు, మరికొన్ని కలిపేసుకునే ప్రక్రియలు రంగంమీదకి వస్తాయి. కొన్ని విషయాల్ని గురించి మాట్లాడటం, మరికొన్ని విషయాల గురించి మాట్లడక పోవటం అనేది జరుగుతుంది. ఇది సూత్రంగా రూపొందుతుంది. ఉదాహరణకి పాశ్చాత్య వైద్య ప్రవచనానికి, దేశీయ ఆయుర్వేదవైద్య ప్రవచనానికి వున్న సంబంధం. ఈ రెండు వైద్య విధానాలు ఎప్పుడూ ఒకే స్థాయిలో గౌరవింపబడవు. పాశ్చాత్య వైద్య శాస్త్రం తన ప్రవచనాల ద్వారా ఉన్నత స్థానంలో ప్రతిష్టించుకుంది. ఆయుర్వేదవైద్య విధానాన్ని లేక ఆక్యుపంక్చర్, హోమియోపతి లాంటివైద్య పద్ధతుల్ని హీనంగా చూసింది. ఈ క్రమమంతా పాశ్చాత్య వైద్య విధానం కొన్ని ప్రవచనాల్ని ముందుకు తేవటం ద్వారా జరిగింది. అందుకే ఈ అంశాల మీద విస్తృతంగా రాసిన ఫుకో లాంటి వాళ్ళ ప్రవచనాల్లో జ్ఞానం, అధికారం విడదీయరాని అంశాలుగా వుంటాయంటున్నారు.

ఫుకో చాలా ఎక్కువ సందర్భాలలో తన విశ్లేషణల్ని కొన్ని రంగాల్ని కేంద్రం చేసుకుని ( ఉదాహరణకి వైద్య, ఆర్థిక, సామాజక శాస్త్ర) కొనసాగించాడు. ఈ రంగాలు కొన్ని చారిత్రక సందర్భాలలో ఏ విధంగా వర్గీకరించబడ్డాయి, ప్రాతినిధ్యం వహించాయి అనేదాన్ని కేంద్రం చేసుకుని ఫుకో తన విశ్లేషణల్ని కొనసాగించాడు. ప్రవచనానికి ఇతర సామాజిక ఆచరణలకి వున్న సంబంధాన్ని బహిర్గతం చేశాడు ఫుకో. 'అధికార ప్రవచనం' అనే మాటని తరచుగా ఉపయోగించాడు ఫుకో. సమాజంలో సర్వ సాధారణంగా, వస్తుగతంగా కన్పించే సామాజక నిర్మాణాలు కొన్ని సామాజక బృందాలకి మాత్రమే విశేష అధికారాన్ని ఎలా కల్పిస్తాయి, మరికొన్ని బృందాల్ని అధికారపు అమలుకు లోబడి వుండేటట్లు ఎలా చేయగలుగుతాయి. అలా లోబడి వుండని బృందాలు ఎలా శిక్షింపబడతాయి, ఈ అణిచివేతలు అమలు కావటానికి ప్రవచనాలు ఎలా దోహదపడతాయి అనే అంశాల్ని ఫుకో చాలా లోతుగా విశ్లేషించాడు.

సమాజంలో ప్రతి రంగాన్ని ఆవరించివున్న, అమలులోవున్న, ప్రవచన రూపాల్ని, పద్ధతుల్ని అవగతం చేసుకోకుండా, వినిర్మించకుండా సమకాలీన సామాజిక వ్యవస్థల్ని అర్థం చేసుకోవటం కానీ, అధికార సంబంధాల్ని ధ్వంసం చేయటం కానీ అసాధ్యమంటున్నారు సామాజిక శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు.

# సబాల్టర్నిజం: ''ఉపశ్రేణివాదం''

– గూడ శ్రీరాములు

> ఆలోచనాకాశంలో - భావనాతారకలు శీర్షికన ఫిబ్రవరి సంచికలో బి. తిరుపతిరావు వ్రాసిన 'ఉపశ్రేణి వాద అధ్యయనాలు' కు గూడ శ్రీరాములు స్పందన

ఆంతోనియో గ్రాంసీ[1] జైలు నోటు బుక్‌ల్లో[2] 'సబాల్టర్న్' అనే పదం కొత్త అర్థంతో ప్రచారానికి రావటం యథార్థం. సబాల్టర్న్ పదానికి సైన్యంలో కర్నల్ (colonel) కి కిందుస్థాయి సైనిక అధికారి అని డిక్షనరీ అర్థం. ఆ సబాల్టర్న్ మరీ దిగువ స్థాయి సైనికుడుగానీ, సిపాయిగానీ కాడు. కర్నల్, సిపాయిల మధ్య స్థానంవాడు. అలాంటి మధ్య స్థానాన్ని సూచించే పదాన్ని గ్రాంసీ ఏ అర్థంలో ఎందుకు వాడాడు?

'సబాల్టర్న్' ఆధునిక అర్థంలో రెండర్థాల అస్పష్ట పదమంటారు. సరళార్థంలో అది శ్రామిక వర్గం/ ప్రొలెటారియట్‌ని సూచిస్తూ 'బూర్జువా' పదానికి వ్యతిరేక పదమన్నారు కొందరు. మరికొందరు శ్రామికవర్గం కాక ప్రబల (dominant) అనే పదానికి వ్యతిరేకార్థ పదమన్నారు.

సబాల్టర్న్ పదాన్ని కింది తరగతులు/ నిమ్న వర్గం అనే అర్థంలోనే వాడాడు గ్రాంసీ. రష్యన్ తత్వవేత్త మిఖైల్ బఖ్తిన్[3] ప్రాంతికులు/ అంతేవాసులు ("marginals"), అపర ("Other") అనే పదాల్ని వాడాడు[4]. గ్రాంసీ సోవియట్‌లో ఉన్న రోజుల్లో సమకాలికుడైన బఖ్తిన్‌తో, అతని రచనలు, అభిప్రాయాల్తో పరిచయం కలిగివుండొచ్చు.

స్టాలిన్ ఆగ్రహానికి గురై గ్రాంసీ కొమింటర్న్ కార్యనిర్వహణని విడిచి స్వదేశం ఇటలీకి తిరిగొచ్చాడు. కొమింటర్న్‌లో సభ్యత్వం కోల్పోయాడు. ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీలో తన తొలిప్రాధాన్యత పోయింది. నియోజకవర్గంలో లేకుండానే 1924 పార్లమెంటు ఎన్నికల్లో గెలుపొందాడు. 1926 లో పార్లమెంటులో ముసోలినీతో ముఖాముఖి తలపడటంతో దాదాపు పన్నెండేళ్ళు జైలుపాలయ్యాడు. ఆ జైలు జీవితంలోనే జైలు నోటు బుక్కులు వ్రాశాడు. అనారోగ్య కారణం వల్ల చివరికి జైలు నుంచి విడుదలై కొద్ది రోజుల్లోనే చనిపోయాడు. ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాక పార్టీ సహచరులు, మిత్రులు, పరిచితులూ ఉండికూడా ఏ ఒకరిద్దరు మాత్రమే హాజరైన అంత్యక్రియ సందర్భం ఒక నిక్కచ్చి, నిష్కపట మేధావికి తన దేశం, ఈ ప్రపంచం బదులివ్వదలిచిన క్రూరమైన వీడ్కోలు కానుక అయ్యింది. ఛరిత్ర ముఖం మీద ఇలాంటి వెక్కిరింత మచ్చలు తక్కువేమీకావు. మార్క్స్‌కీ ఇలానే జరిగింది.

అప్పటి కమ్యూనిస్టు దేశాల్లో, ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల్లో ప్రొలెటారియట్ - బూర్జువా అనే రెండు వర్గాలు గుర్తించబడ్డుండగా గ్రాంసీ సబాల్టర్న్ - డోమినంట్ అనే వర్గ నిర్ణయం ఎందుకు చేసినట్టు?

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల కార్మికవర్గాలు మాత్రమే విప్లవ నాయకత్వం

నిర్వహించగలవని మార్క్స్ అభిప్రాయపడ్డాడు. కాని రష్యాలాంటి ''రోగిష్టి'' వెనకబడ్డ దేశంలో విప్లవం విజయం సాధించగలగటంపై **'The Revolt Against Das Kapital'** అనే వ్యాసం రాశాడు గ్రాంసీ. అది 'అవంతి'[5] నవంబరు, 1916 సంచికలో ప్రచురణ పొందింది. రష్యాలో ఉన్నప్పుడు ట్రాట్స్కీకి సన్నిహితుడై మన్నన పొందగలిగాడు గ్రాంసీ[6]. ఇటాలియన్ తత్వవేత్త బెనెదెత్తో క్రోచే పట్ల ఎప్పుడూ ఆసక్తి చూపుతూ వచ్చాడు. దీనివల్ల గ్రాంసీ మార్క్సిస్టు నిబద్ధత పట్ల కొందరు అనుమానాలు వ్యక్తపరిచారు. గ్రాంసీని పునఃమూల్యాంకన చేయబూనారు. జైలు నోటుబుక్కుల్లో అనేక పరస్పర వైరుధ్యాలున్నాయన్నారు.

ఏమైనా, ఇటలీలో 'లోర్డిన్‌నొవొ' (నవపథం)[7] స్థాపకుడు, ఇటాలియన్ సి.పి. సంస్థాపకసభ్యుడు, దాని సిద్ధాంతవేత్త, ఉదార జైవిక **(Organic)** కమ్యూనిస్టు మేధావి అయిన గ్రాంసీ స్టాలిన్ అనుసరణల్ని అంగీకరించలేకపోయాడు. వర్గపోరాటం వల్లనే చరిత్రగతి ఎల్లప్పుడు నియంత్రిత మవుతుందనే విశ్వాసాన్ని నమ్మనిరాకరించాడు. మార్క్సిస్టు తరహా సామ్యవాదం రాష్ట్రానికి తిరుగులేని శక్తి తెచ్చిపెడ్తుందన్నాడు. తన నోటు పుస్తకాల్లో ప్రభుత్వ, రాష్ట్రం, ఆధిపత్యం మొదలగు అంశాల్ని విస్తృతంగా చర్చించాడు. ప్రొలెటారియట్ అన్న పదం శ్రామికవర్గ ఆధిపత్యం సూచించే పదమనీ, అంతో కొంతో సంపాదించగలిగిన శ్రామికవర్గం కంటె ఏ దేశాల్లోనైనా నిస్సహాయ సాధారణ ప్రజానీకం ఎక్కువనీ ట్రాట్స్కీలానే, ట్రాట్స్కీ అభిమాని గ్రాంసీ కూడా భావించాడు. ఆ అట్టడుగు సాధారణ ప్రజని ''సబాల్టర్న్'' అన్నాడు. అలానే ''బూర్జువా'' అన్న వర్గీకరణలోని అతి వ్యాప్తతని కుదించి అందులోని ఉన్నతవర్గాన్ని ''డోమినంట్'' అన్నాడు. శాస్త్రీయ కమ్యూనిజంలోని ప్రొలెటారియట్ - బూర్జువా బదులుగా సబాల్టర్న్ - డోమినంట్ పదాల్ని వాడాడు. అలా గ్రాంసీతో సబాల్టర్న్ అన్న పదం ప్రచారంలోకి వచ్చింది.

గ్రాంసీ ఈ సబాల్టర్న్ (నిమ్నవర్గ) భావనని ఫ్రెంచి ఎనాల్ బృంద చరిత్రకారులు[8] బాగా ముందుకి తెచ్చారు. చరిత్ర ఎలా కొత్త విధానంలో రాయబడాలో నిర్ధారించారు. ఎగువ నుంచి కాక దిగువ స్థాయి నుంచి చరిత్ర వ్యాఖ్యానించ బడాలన్నారు. చరిత్ర రచనని తన తొలి శిష్టత **(eliticism)** నుంచి తప్పించ దలిచారు[9]. మనిషి నమ్మకం వ్యక్తిగత జీవిత పద్ధతి, మనస్తత్వాలపై బలమిచ్చారు. కేంబ్రిడ్జ్ స్కూలు, సబాల్టర్న్, ఉత్తర - నిర్మాణవాద, ఉత్తర - ఆధునికతావాద చరిత్రకారులు ఆ చరిత్ర రచనకి పూనుకున్నారు. సస్సూర్ భాషాతత్వం, క్లాద్ లెవి- స్ట్రోస్ మిథోలజీ విశ్లేషణ, ఫుకో భావనలు, దెరిదా ప్రతివచనం **(discourse)**, వినిర్మాణం మొ॥ సమస్తాన్నీ ఇమిడ్చుకుని చరిత్ర రచన జరిగింది[10].

ససెక్స్, కేంబ్రిడ్జ్ లాంటి విశ్వవిద్యాలయాల్లో స్థిరపడిన భారతీయ విద్యావేత్తలు ఈ సబాల్టర్నిజంని ఒక ఉద్యమ స్ఫూర్తితో ప్రచారం చేబట్టారు. అయితే వాళ్ళలో కొందరు మిథ్యా **(Psendo - సూడో)** మార్క్సిస్టులు, వామపక్ష వాదులుగా చెప్పుకోదలుస్తున్నవారు అతి జాగ్రత్తగా సాంప్రదాయిక మార్క్సిస్టు పారిభాషిక పదాలకి బదులుగా కొన్ని నిరపేక్ష పదాలు వాడుతుంటారనే

ఎత్తిపొడుపులున్నాయి. ఉదాహరణగా ప్రొలెటేరియట్ పదానికి బదులుగా వంచితులు (the deprived), పోగొట్టుకున్నవాళ్ళు (the dispossed) లాంటి పదాలు వాడుతుంటారంటారు. ఆ విద్యాధికులు ఎక్కువగా ఆంగ్లపరిపాలనా కాలంనాటి రికార్డులమీద ఆధారపడ్తుంటారు కనక ముందుకి సాగలేకపోతుంటారనే విమర్శకూడా వుంది.

మన దేశానికి ఈ సబాల్టర్న్ స్పృహ అరవైల్లోనే వచ్చినట్టు చెబుతారు. అయితే గ్రాంసీ రచనలు, భావనలు ఎనభైల సరికల్లా మన దేశాన బాగా ప్రచారంలోకి వచ్చాయి. గ్రాంసీ కొన్ని రచనలు మన విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలయినాయి. వివిధ రాష్ట్రాల్లో సబాల్టర్న్ నిర్మాణాలు, సాహిత్యం బాగా పుంజుకున్నాయి. Subarltern Studies ఎనిమిదో భాగందాకానేమో వచ్చి మరింత సైద్ధాంతిక బలం, ఉత్సాహం పెంచగలిగాయి. రణజిత్‌గుహ, పార్థ చట్టోపాధ్యాయ, శాహిద్ అమీన్, డేవిడ్‌హార్డిమన్ (అమిక్, అర్నాల్డ్‌అన్నారు తిరుపతిరావు), దిపేశ్‌చక్రవర్తి, జ్ఞానేంద్రపాండే, గౌతమ్‌భద్ర మొదలైనవారు (వీళ్లిద్దరు సబాల్టర్న్ చైతన్య ప్రచారకులు, సిద్ధాంతకర్తలు, చరిత్రకారులు) అవుతున్నారు. మనలో కూడా సబాల్టర్న్ మేధావులు లేకపోలేదు.

''ఆధునిక చరిత్ర చర్చ నిరంతరాయతలో నిమ్నవర్గ భావన ఒక కొత్త దిశని తెరిచింది''. ''ఉన్నత, నిమ్న వర్గాలనే విభజనతో పాటు ఉన్నతవర్గ ఆధిపత్యం, నిమ్న వర్గ పరాధీనతలు కూడా వాస్తవికతలేనని గుర్తు చేయబడ్డాయి'' (పార్థ చట్టోపాధ్యాయ).

ఆస్ట్రేలియాలో స్థిరపడిన గ్రాంసీవేత్త, సబాల్టర్న్ చరిత్రకారుడు, అధ్యాపకుడు అయిన రణజిత్ గుహ ''సబాల్టర్న్'' పదానికి ''నిమ్నవర్గం'' అంటూ దాన్ని విడమర్చి చెప్పాడు. ''భారతదేశాన ఆంగ్ల పరిపాలనా కాలంలో ఉన్నత పదవులు, అధికారులు నెరిపిన వాళ్లందరూ నా దృష్టిలో ఉన్నత వర్గంవారు. వాళ్లని వదిలేయగా తక్కిన ప్రజలంతా నిమ్న వర్గంవాళ్లు. పట్టణాల్లోని కార్మికులు - బీదలు, చిన్న చిన్న ఉద్యోగాల్తో జీవిక సాగించిన మధ్య తరగతుల వాళ్ళు, పల్లెల్లోని వ్యవసాయ కార్మికులు, బీదలు అందరూ నిమ్నవర్గానికి చెందుతారు'' అంటాడు. "Subalternism is a connected history of lower classes" అనబడింది. ('Statesman' లోనని పార్థ చట్టోపాధ్యాయ).

రణజిత్ గుహ వివరించిన పై వర్గీకరణ అప్పటికీ, ఇప్పటికీ వర్తించేదే అవుతుంది. ఆ వర్గీకరణ కుల, తెగ, లింగ, మత అంతర్గత నిర్మాణాల్లో కూడా ఉండొచ్చు. కనక సబాల్టర్నిజంని ప్రాతిపదికగా చెప్పినప్పుడు ఒక వైరుధ్యం ఎదురవుతుంది.

సబాల్టర్న్ పదానికి ''నిమ్నవర్గం'' / వంచిత వర్గం / వివక్షిత వర్గం / ఉపేక్షిత వర్గం అని సబాల్టర్న్ మేధావులు చెబుతుండగా తిరుపతిరావు దాన్ని ''ఉపశ్రేణులు'' అనదలుస్తున్నారు. సబ్‌కి ఉప అనే అర్థం వచ్చినా ''ఆల్టర్న్'' మాత్రం ''శ్రేణులు'' అవరాదు ఆ ''ఉపశ్రేణులు'' కూడా ఏవి?

బ్రిటన్‌లో స్థిరపడిన భారతీయ సబాల్టర్న్ మేధావులు దళిత, వెనుక బడ్డ జాతులు, స్త్రీ, మైనారిటీ, క్రిస్టియన్ దళిత మొ॥ వర్గాల్ని సబాల్టర్న్‌లుగా విశ్లేషణ, సమీక్షణ చేస్తున్నారు. అయితే ఆ సబాల్టర్న్

అనే మాటలో ఇంకా అదనపు వివరణ స్పష్టం కాలేకపోతున్నదని తిరుపతిరావు భావించినట్లున్నారు. ''నిమ్నవర్గాలు'' అన్న మాట కించపరిచే(**derogatory**) మాటగా భావించైనా ఉండొచ్చు. పాశ్చాత్య దేశాల్లో సమలైంగికులు కూడా సబాల్టర్న్ వర్గంలో చేర్చబడ్డారు. మునుముందు మన దేశాన కూడా వికలాంగులు, వృద్ధులు, ఫుట్‌పాత్ పిల్లలు, వేశ్యావృత్తివారు, హోటల్‌కార్మికులు, హాస్పిటల్ దిగువ సిబ్బంది మొ॥ ఖండఖండ **"demand groups"** అంతులేకుండా పెరిగే వీలుంది. కనక వీటన్నింటినీ పసిగట్టి వాటికో తాత్విక ఆలంబన కల్పించే సంకల్పంతో ''ఉపశ్రేణి వాదం'' అనివుండొచ్చు.

**"Subalternism is the frogmentary explanation of popular mentality (Statesman** అని) అవొచ్చు. **"Subaltern Classes are not unified and cannot unite until they are able to become a state"** (గ్రాంసీ) అవొచ్చు. సబాల్టర్న్ ఉద్యమ తత్వం విడివిడి లక్ష్యాల్తో సాగుతూ వుండొచ్చు. అంతమాత్రాన ఆ విడితనాల్ని ఉత్తర- ఆధునికతావాద అణు విశ్లేషణ లక్ష్యానికి అన్వయించి, దాన్ని హైలైట్ చేసి, దానికొక ప్రామాణికత, సమర్థన కల్పించ దలవటం గ్రాంసీ, రణజిత్‌గుహల ఆశయాలకీ, అభిప్రాయాలకీ ఎంతవరకు చేరువ కాగలదో ఆలోచించదగ్గ విషయం అవుతుంది. ''ఉపశ్రేణివాదం'' తిరుపతిరావు పో.మో లక్ష్య ప్రయత్నమే అనిపించవచ్చు.

సబాల్టర్న్ చరిత్రవేత్తలు, గ్రాంసీ ''పౌర సమాజాలు'' **(Civil Societies)** అనే మాటని వాడారు. ప్రత్యేక డిమాండులు, లక్ష్యాలు ముఖ్యంగా సూచించే అర్థంలో ఆ మాట వాడబడిందేగాని **Sub-classes, Sub - layers** అనే విభజనల్ని సూచించే పదం కాదు. **"Subaltern Classes"** నిమ్న వర్గాల్ని సూచిస్తుందే'' కాని ''ఉపశ్రేణులు'' అనికాదు. ''ఉపశ్రేణులు'' లో విభజనతత్వం ముఖ్యంగా సూచించబడ్తున్నది. సమాజాన్ని విడివర్గాలుగా చీల్చినప్పుడు కొన్ని ప్రశ్నలకి సమాధానాలు అందకుండా పోతున్నాయి కనక మొత్తంగా ఆ విభజన చింతన **"Conceptually Vague"** అనే అతి / విపరీత నిర్ధారణలు కూడా అవసరం లేదు.

''ఉన్నత వర్గాలు కేవలం ఆర్థికంగానే కాక రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, పరిపాలనా యంత్రాంగాల ద్వారా తమ ఆధిపత్యాన్ని **(hegemony)** సాగిస్తూ వుంటాయి. పాలకవర్గం బలప్రయోగం, అణిచివేతలకి దిగకుండానే ప్రజల ఆమోదాలు పొందే ప్రయత్నాలు జరిపి సంఘర్షణ తలెత్తకుండా జాగ్రత్తపడ్తుంది. చాకచక్యంతో తన స్వార్థాన్ని ''సమాజపు సర్వజనీన స్వార్థం''గా భ్రమింపజేసి సామాజిక విప్లవాలు తలెత్తకుండా వాట్ని వాయిదా వేయించగలుగుతుంది. ఎప్పుడైతే ఆ అణగదొక్కేవాళ్లు, అణగదొక్కబడేవాళ్లలో భ్రమలు వీడిపోయి అలజడి రేగుతుందో అప్పుడు ఆ పాలక ఉన్నత వర్గాలు తమ అధీనంలోని రాష్ట్ర శక్తితో దమన పంథా అవలంభించి ప్రభుత **(Dominance)** తమ చేతుల్లోంచి జారిపోకుండా తగు కట్టుదిట్టాలు జరుపుతుంటారు'' అంటాడు గ్రాంసీ. సామాజిక విప్లవాలకి ప్రొలెటారియట్లే అవసరంలేదని, అది సబాల్టర్న్‌ల వల్ల కూడా జరగొచ్చని అభిప్రాయపడ్డాడు.

గ్రాంసీ పేర్కొన్న ఆ సబాల్టర్న్ (నిమ్నవర్గం) లోని ''నిమ్న'' తనతో మోసుకుపోతున్న సారార్థం (essence) మరింత విశ్లేషణ ప్రాధాన్యం కోర్తుంటుంది. కుల, మత, లింగ వైషమ్యాలు దాటి మరుగుపడుతున్న ఏదో ఒక మౌలిక, తక్షణ సత్యం, వాస్తవం మరింత వెలుగు కోర్తుంటుంది. ఆవిష్కరణ కోర్తుంటుంది.

గత దశాబ్దిన్నర కాలంలో ఆశించిన లక్ష్యాలు, చేరదలిచిన గమ్యాలు ఆశానురూపాలు కాకపోతున్న అనుభవాల్లోంచి ఒక సామగ్రిక (holistic) అనుసరణ అవసరం పట్ల ఇటీవలగా మేధావివర్గాల్లో పునరీక్షణ ముందుకి రాదలుస్తున్నది. ఐక్యతల ఆవశ్యకతల సరికొత్తగా గుర్తించబడదలుస్తున్నది.

## సందర్భాలు :

1. Antonio Gramsci (1891 - 1937). గ్రాంసీ కూడా అవొచ్చు.
2. Quaderni del cerece / Prison Note books. ఇవి మొత్తం 32. పేజీల మొత్తం సంఖ్య 3000లకి మించి 1926 - 37 ల మధ్య 12 సంవత్సరాల కాలంలో జైలులో రాయబడ్డాయి. ఇటాలియన్‌లో Resorgimento Rome ద్వారా 1954లో ప్రచురణ. ఆంగ్లానువాదం 1971. ఓరియంట్ లాంగ్‌మన్, చెన్నయ్ Antonio Gramsci: Selections from person Notebook దాదాపు 2 ఏళ్ళ క్రితం కొన్ని ఎంపికల్తో ప్రచురించింది. బెంగాలీ భాషలో అనువాదాలు, వివరణ / వ్యాఖ్యాన గ్రంథాలు, చాలా సాహిత్యం వచ్చాయి. మనలో అలాంటి ప్రయత్నం జరిగిందేమో!
3. Mikhail Bakhtin (1895 - 1975). స్టాలిన్ కాలాన ''నమ్మకస్తుడు'' కాడని అనుమానించబడి నానా బాధలు పడ్డాడు. క్రుప్స్కయా లెనిన్ జోక్యంతో బయట పడగలిగాడు. Dialogue, Chronotope, Carnival మొ॥వాటి సిద్ధాంతకర్త.
4. Problems of Dostoevsky's Poetics' గ్రంథం, రష్యన్ manuscript ల నుంచి 1929లో గ్రంథ రూపం. ఆంగ్లానువాదం Caryl Emerson సంపాదకత్వంలో 1984లో మాంచెస్టర్ విశ్వవిద్యాలయం ప్రచురణ.
5. 1922లో నియంత కాకపూర్వం ముసోలినీ సంపాదకత్వంలో వెలువడిన సోషలిస్టు పత్రిక. కొన్నాళ్లు గ్రాంసీ దాని సహ- సంపాదకుడు. తనని రాజకీయంగా ఎదిరించినా ఆ పూర్వ సంబంధం వల్లనే స్టాలిన్ చేత హత్యా ప్రయత్నం జరగకుండా గ్రాంసీని అన్నాళ్ళూ జైలులో ముసోలినీ ఉంచాడనేవాళ్ళున్నారు.
6. ట్రాట్స్కీ తన Literature and Revolution గ్రంథంలో 'ఇటాలియన్ భవిష్యవాదం (ఫ్యూచరిజం): ఫాసిజంతో దాని సంబంధం' అనే విషయం మీద గ్రాంసీ చేత వ్యాసం

వ్రాయించి అనుబంధంగా చేర్చాడు. ('The Prophet - Unarmed' - Isaac Dentscher - (డైసర్) - పే. 185, For. 1)

7. **Ordine Nuovo** - రాడికల్ ఉద్యమం, సంస్థ

8. **Annales School.** వీళ్లలో చాలమంది వామపక్షీయులు ఫెర్డినాండ్ / ఫెర్నాండ్ బ్రోదెల్ **(Ferdinard Brandel)**

   - 'The Mediterranean and the Mediterranean World in the Age of Philip II.'

   లిరోయ్ లాదురి (Le Roy Ladurie)

   ' The Peasants of Languedoc : An Economic History'

   లూసీc ఫెబర్ (Lucien Febure)

   మార్క్ బ్లోక్ (Marc Bloch)

   మొ॥ చరిత్రవేత్తలు.

9. మన దేశాన కూడా అలాంటి ప్రయత్నాలు జరిగాయి. డి. డి. కోశంబి

   - 'The Culture and Civilisations of Ancient India in Historical Outline'.

   రోమిలా థాపర్ (బిటన్) - Ancient Indian Social History: Some Interpretations'

   రమేష్ శరణ్ గుప్త - 'Sudras in Ancient India)

   ఆల్టేకర్ మొ॥ మరి కొందరు కూడా.

10. ఈ సందర్భంగా ఉదహరించ బడ్తున్న గ్రంథాలు:

| | | |
|---|---|---|
| Franz Fanon | - | 'The Wretched of the Earth' |
| A.L. Morton | - | 'People' |
| Rodney Hilton | - | 'Bondismer' |
| George Rude | - | 'Crowd' |
| E.P. Thompson | - | 'Working Class' |
| Eric Hobsbawm | - | 'Primitive Rebel' |
| Albert Sobonl | - | 'Sansenlotti' |

# హృదయ సమస్యలను విప్పేదే సాహిత్యం

## *1949* నోబెల్ సాహిత్య బహుమతి పురస్కారోపన్యాసము

మూలం : విలియం ఫాక్నర్ అనువాదం : **బి.వి. రామిరెడ్డి**

మీరిస్తున్న ఈ పురస్కారం వ్యక్తిగా నాకు కాక నా జీవిత కాలపు శ్రమకు ఫలితంగా ఇస్తున్నారని భావిస్తున్నాను. నా శ్రమలో మానవాత్మయొక్క దుఃఖమూ, స్వేదమూ నిండి ఉన్నాయి. గొప్పదనం కోసమో ప్రతిఫలం కోసమో కాక, ఇంతకు ముందెన్నడూ లేనిదాన్ని, మానవాత్మనించి సృజించి నందుకుగాను ఈ పురస్కారం ఇవ్వబడుతోంది, కాబట్టి ఇది నాకే చెందుతుంది. ఈ క్షణాన్ని నా జీవిత శిఖరాగ్రంగా భావిస్తున్నాను. ఈ శిఖరాగ్రాన్నించి, ముందుముందు నాలాగే ఈ కృషిలోని శ్రమనీ దుఃఖాన్నీ అనుభవిస్తున్న స్త్రీ పురుషుల్లో ఎవరో వొకరు నేను నించున్న చోటనే నించుని నేను వినిపించిన మానవాత్మఘోషనే వినిపిస్తారు.

ప్రస్తుతం మనమంతా విశ్వవ్యాప్తంగా భయంకరమైన భయంలో ఉన్నాము. ఇప్పుడు ఆధ్యాత్మిక సమస్యలులేవు. ఉన్నదల్లా మనమంతా ఎప్పుడు పేల్చివేయబడతామా అన్నభయమే! అందుచేతనే నేటి యువ రచయితలూ, రచయిత్రులూ హృదయ సమస్యల్ని మర్చిపోయారు. నిజానికి హృదయ సమస్యల్ని గురించి చెప్పేదే మంచి సాహిత్యం; అలాంటి రచన చేయడంలో ఎదుర్కొనే బాధలే అర్థవంతమైనవి.

అన్నింటిలోకీ భయంకరమైనది భయమేనని తెలుసుకోవాలి. భయాన్ని శాశ్వతంగా మరిచిపోవాలి. హృదయ సత్యాల్లోని విచిత్రాలను, ప్రాపంచిక సత్యాలైన ప్రేమ, అభిమానం, దయ అభిజాత్యం, సహానుభూతి, త్యాగం లాంటి వాటిని గురించే వ్రాయాలి. అయితే ఆధునిక రచయిత ప్రేమను గురించికాక కామాన్ని గురించీ, ఓటముల్ని గురించీ వ్రాస్తున్నాడు. అలాంటి వాటిలో మనిషి పోగొసుకునే విలువైనవేవీ వుండవు. అతని దుఃఖం ప్రాపంచిక శిథిలాల మీద దుఃఖిస్తుంది. అతడు హృదయాన్ని గురించికాక గ్రంథుల్ని గురించి వ్రాస్తాడు.

అతడు ఈ విషయాలను పునశ్చరణ చేసుకునేదాకా తాను మనుషుల మధ్య నించుని మానవాళి అంతాన్ని పరిశీలించినట్లు భావిస్తాడు. మనిషి అంతాన్ని నేను వొప్పుకోను. మనిషి శాశ్వతుడు అని చెప్పడం తేలిక. మనిషి జీవచ్ఛవంలాగా జీవిస్తూనే ఉంటాడనడాన్ని నేను వొప్పుకోను. మనిషి శాశ్వతుడు. మృగాలకన్నా తెలివైన వాడవడంవల్లనే అతడు శాశ్వతుడు కాడు. అతనికి ఆత్మ ఉంది. అతనిలో సానుభూతి ఉంది, త్యాగం ఉంది. అందువల్లనే అతడు శాశ్వతుడు. కవీ, రచయితా వీటిని గురించే వ్రాయాలి. అది అతని బాధ్యత. మనిషికి అతని హృదయాన్నీ, ఆత్మనూ ఆవిష్కరించి చూపి అతని సాహసాన్ని, ఆత్మగౌరవాన్ని, ఆశని, గర్వాన్ని, సానుభూతిని, దయను, త్యాగాన్ని గతం నుండి అతనికి గుర్తుచేయాలి. కవి కేవలం మనిషిని గురించిన పైపై విషయాలను క్రోడీకరిస్తే సరిపోదు. మనిషికి శాశ్వతంగా, ధైర్యంగా నిలబడేందుకు ధైర్యాన్నీ ఆసరానీ ఇవ్వగలగాలి.

## జీవిత చరిత్ర

విలియం ఫాక్నర్(1897-1962) మిసిసిపీ రాష్ట్రంలోని ఆక్స్‌ఫర్డ్‌లో ఒక ప్రాచీన కుటుంబంలో జన్మించాడు. మొదటి ప్రపంచయుద్ధంలో కెనెడియన్, బ్రిటిష్ రాయల్ ఎయిర్‌ఫోర్సులో పనిచేశాడు. కొద్దికాలం మిసిసిపీ విశ్వవిద్యాలయంలో చదివాడు. న్యూయార్కులోని ఒక పుస్తకాల షాపులో కొద్ది రోజులు, న్యూ ఆర్లియన్స్ వార్తా పత్రికలో కొన్ని రోజులు పనిచేశాడు. యూరోపులోను, ఆసియాలోను చిన్న చిన్న పర్యటనలు చేశాడు. కొద్ది కాలం హాలివుడ్‌లో సినిమా స్క్రిప్టు రచయితగా ఉన్నాడు. మిగిలిన జీవితకాలమంతా ఆక్స్‌ఫర్డ్‌లోని తన ఫారం హౌస్‌లో నవలలూ, కథలూ వ్రాస్తూ జీవించాడు.

తనదైన సాహితీ ప్రస్థానాన్ని సృజించుకోవడంకోసం ఫాక్నర్ కొన్ని ప్రత్యేకమైన పాత్రలను సృజించాడు. అవి దక్షిణాది రాష్ట్రాల ప్రగతికీ పతనానికీ ప్రతీకలు. ఫాక్నర్ నవలలలోని మానవ జీవిత నాటకం నూటయాభై సంవత్సరాల చారిత్రక నిజాలను ఆవిష్కరిస్తుంది. ప్రతి కథ, నవల ఆ నాటకపు సమగ్రతలో భాగాలే. అవి ఊహాజనితమైన యోక్నాపటాల్పా దేశపు ప్రజల్ని గురించి చెబుతాయి. ప్రాచీన దక్షిణాది రాష్ట్రాల పతనాన్ని సార్టోరీస్, కాంప్సన్ కుటుంబాల ద్వారాను, కొత్తగా వచ్చిన స్నోప్సెస్ ద్వారాను తమ సందేశాన్నిస్తాయి. ది సౌండ్ అండ్ ఫ్యూరీ (1929)లో ప్రధానాంశమూ, కళాత్మకతా అంతర్‌స్వగతం ద్వారా సాధించాడు. ఈ నవలలోని కాంప్సన్ కుటుంబ పతనాన్ని పాత్రల మనస్తత్వాల ద్వారా తెలియజేస్తాడు. 1931లో రచింపబడ్డ 'శాంక్చువరీ' నవల టెంపుల్‌డ్రేక్ అనే ప్రసిద్ధ దక్షిణాది కుటుంబానికి చెందిన యువతి పతనాన్ని వివరిస్తుంది. 'రెక్వియం ఫర్ ఎనన్(1951) అనే నవల చాలా భాగం నాటకంగా నడుస్తుంది. ఇందులో పైన చెప్పబడిన యువతి 'టెంపుల్ డ్రేక్' వేశ్యగా మారడంలో ప్రధానపాత్రధారి అయిన ఒక నీగ్రో స్త్రీ మీద నడిచే విచారణ, కోర్టు దృశ్యాలూ వర్ణించబడ్డాయి. 'లైట్ ఇన్ ఆగస్ట్ (1936) నవలలో ఒక తండ్రి, సోదరుడు ఒక యువకుణ్ణి రక్తసంకరం కారణంగా వెలివేయడం ప్రధానాంశం. 'ఇంట్రూడర్ ఇన్ ది డస్ట్' (1948) నవలలో ఫాక్నర్ తెల్లవారు, నీగ్రోలమధ్య సంబంధాలవల్ల ఏర్పడ్డ నీతినియమాల సమస్యల్ని వివరిస్తాడు.

1940లో ఫాక్నర్ స్నోప్స్‌త్రికం - 'ది హామ్లెట్' 'ది టౌన్' 'ది మాన్షన్' వెలువడ్డాయి. ఇవి స్నోప్స్ కుటుంబం ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదిగినవైనాన్ని వర్ణిస్తాయి. అతని ఆఖరిదీ, హాస్యభరితమైనదీ అయిన రచన 'ది రీవర్స్' (1962) దీనికీ, మార్క్‌ట్వైన్ 'హక్‌బెర్రీఫిన్' కీ ఎన్నో పోలికలున్నాయి. ఫాక్నర్ 1962లో కన్నుమూశాడు.

ప్రాథమికంగా విలియం ఫాక్నర్ ప్రాంతీయ రచయిత. స్వీడిష్ పాఠకులకు ఫాక్నర్ పేరు విన్నప్పుడు తమ ప్రసిద్ధ నవలాకారులైన సెల్మాలాగర్లోఫ్, హెచ్. బెర్గ్‌మన్‌లు గుర్తొస్తారు. ఫాక్నర్‌కీ మా రచయితలకీ మధ్య పోలికల్ని గురించి విస్తృతంగా చెప్పవచ్చు. కాని, కాలాభావంవల్ల ఆ పని చేయలేకపోతున్నాను. ఫాక్నర్‌కీ, వారిరువురికీ మధ్య ఉన్న ప్రధానమైన తేడా ఏమిటంటే, ఫాక్నర్ సాహిత్యపు ప్రాతిపదిక ఆ ఇరువురి సాహిత్య ప్రాతిపదిక కన్నా చీకటిమయమూ, రక్తసిక్తమూను. ఫాక్నర్ వాటి మూలాలతో

సహా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పురాణ రచయిత. వీటి నిండా చౌకబారు నీగ్రో బానిసల శ్రమ; సాంఘిక, ఆర్థిక మూలాలను దెబ్బతీసిన అంతర్యుద్ధం, ఓటమి, యాంత్రీకరణ; పారిశ్రామికంగా, వ్యాపారపరంగా మార్పులకు లోనైన భవిష్యత్తు మొదలైన విషయాలు వర్ణించబడ్డాయి. ఫాక్నర్ నవలలు క్రమంగా ఈ విషయాలనే లోతుగా అహూహనా త్రీవతతో వర్ణిస్తాయి. ఫాక్నర్ కుటుంబం అంతర్యుద్ధపు ఓటమియొక్క ఫలితాలైన పేదరికం, పతనావస్థల్ని ఎదుర్కొన్నది. అతణ్ణి రియాక్షనరీ అన్నారు. ఆ మాట కొంతవరకు నిజమే. ఒక్క మాటలో చెప్పాలంటే రచయితగా ఫాక్నర్ ఒక తరహా జీవనశైలిని ఆకాశానికెత్తాడు. ఆ ప్రాంతీయతత్వమే అతనికి విశ్వవ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది.

అంతర్యుద్ధపు కాన్వాసుమీదే ఫాక్నర్ తన ముఖ్యమైన నవలల్ని చిత్రించాడు. అంతర్యుద్ధం సృష్టించిన పేదరికంలాంటి చేదు అనుభవాల్లోంచే ఫాక్నర్ రచయితగా ఎదిగాడు. ఇరవై ఏళ్ళ వయసులో కెనెడియన్ విమానదళంలో చేరాడు. రెండుసార్లు ప్రమాదాల్లో చిక్కుకున్నాడు. మిలిటరీ హీరోగా కాక, శారీరకంగా, మానసికంగా దెబ్బతిన్న సామాన్యుడిగా తిరిగివొచ్చాడు. యువకుల్లో సహజంగా ఉండే యుద్ధకాంక్ష, రోమాంచితమైన అనుభవాలను చవిచూడాలనే కుర్రతనం, అతణ్ణి యుద్ధంలో చేరేందుకు ప్రేరేపించాయి. ఈ అనుభవాల్లోంచే 'ఎవర్నీ చంపకు' అనే బైబిలులోని అయిదవ కమాండ్మెంట్ని గ్రహించుకుని మనిషిగా మారాడు. అన్యాయాన్నీ, ద్వేషాన్నీ, అగౌరవాన్నీ, న్యూనతనీ సహించ కూడదని తెలుసుకున్నాడు. అశాంతి సమయంలో ఫాక్నర్ ఈ రెండిటి మధ్యా సమతౌల్యాన్ని ఎలాసాధించగలిగాడని కొందరు ప్రశ్నించవొచ్చు.

రచయితగా ఫాక్నర్కి సమస్యలకు పరిష్కారాల్ని సూచించడంలో ఇష్టంలేదు. అంతర్యుద్ధపు ఓటమి, దానివల్ల కలిగిన ప్రభావాల నుండి అతని సాహిత్య మహాగ్రంథాలు వెలువడ్డాయి. సామాజిక మానవ సమూహం మీద కంటే, సమాజంలో ఒకడైన మనిషి మీదనే అతని వ్యక్తిత్వపు సంఘటితత్వం మీదనే ఫాక్నర్ దృష్టి నిలిపాడు. ఇలాంటి వ్యక్తుల జీవితాల్లోని విషాదాలు గ్రీకు విషాదాంత నాటకాల్లోని విషాదాల్లాంటివి కావు. ఆ వ్యక్తులు వంశ పారంపర్యంగాను, సాంప్రదాయం వల్లనూ, పరిస్థితుల ప్రభావం వల్లనూ ఏర్పడ్డ వాంఛలవల్ల తమతమ జీవిత చరమగమ్యాల్ని చేరుకుంటారు. తరతరాలుగా వచ్చిన కట్టుబాట్లు, నీతినియమాల అడ్డంకులవల్ల వాళ్ళు హఠాత్తుగానో, నెమ్మదిగానో, బంధవిముక్తమయ్యే ప్రయత్నంలో వారి జీవితాలు గమ్యోన్ముఖంగా వెడతాయి. తన ప్రతి రచనలోను ఫాక్నర్ మానవ మస్తిష్కపు అగాధాల్లోకీ, గొప్పతనాల్లోకీ, శక్తుల్లోకీ, ఆత్మార్పణల్లోకీ, అధికార దాహంలోకీ, వాంఛల్లోకీ, ఆధ్యాత్మిక రాహిత్యంలోకీ, సంకుచితత్వంలోకీ, దుఃఖం, భయం, పతనాల్లోకి చొచ్చుకుపోయాడు. మానవ మనస్తత్వపు లోతుల్ని కనుక్కునే మానసిక శాస్త్రవేత్తగా తనకాలంలో ఫాక్నర్కు సాటిరాగల అమెరికన్, బ్రిటిష్ రచయిత లెవ్వరూ లేరు. అతని సమకాలీనులెవ్వరికీ అతనికున్న భావనాబలంగానీ, పాత్ర చిత్రణా శక్తిగాని లేదు. అతడు సృజించిన అధిమానవ, దానవ స్వభావ పాత్రలయొక్క విషాదమూ, హాస్యమూ అతని మనో ప్రపంచం నించి ఉద్భవించినవే. అవి తమ పరిస్థితుల్లో, తమవైన ఇంపులతో,

కంపులతో, నీగ్రో స్వేదంతో, గుల్మాల వాసనల్తో మనల్ని కమ్ముకుంటాయి. మైదాన చిత్రీకరణలో ఫాక్నర్‌కి ప్రత్యేకమైన సమగ్రత, అభినివేశమూ ఉన్నాయి. జేమ్స్ జాయిస్ లాగే ఫాక్నర్ కూడా ఇరవయ్యో శతాబ్దపు నవలాకారుల్లో తిరుగులేని ప్రయోగవాది. అతని ఏ రెండు నవలలూ ఒకటిగా ఉండవు. ఈ ప్రయోగవాద దృష్టే అతనికి నవలా రచన మీద తిరుగులేని అధికారాన్ని సాధించిపెట్టింది. ఆధునిక అమెరికన్, ఆంగ్ల రచయిత లెవ్వరూ భాష విషయంలోను, శైలిలోను అతనికి సాటిరారు. వాక్య నిర్మాణ చాతుర్యంలో జాయిస్, మెరిడిత్‌లు మాత్రమే అతనికి సాటి. చిన్న చిన్న వాక్యాల ద్వారా సంఘటనా క్రమాన్ని సాధించడంలో ఇతని కెవరూ సాటిరారు. భాషా విషయాల్లో అతనికి తిరుగులేని అధికారం ఉంది. అతని భావతీవ్రత నిజాల లోతుల్ని పట్టి చూపుతుంది.

తరచుగా ఫాక్నర్‌ని నియతివాది అంటుంటారు. అతనెప్పుడూ తానొక జీవన తత్వానికి కట్టుబడ్డట్టు చెప్పుకోలేదు. సమస్తం అనేది దేన్నీ స్థిరీకరించదు. మనిషి అంతందాకా సంఘర్షిస్తూనే ఉంటాడు. ప్రతిమనిషి, ఎప్పుడో అప్పుడు, తాను పొందవలసిన శిక్షను పొందితీరతాడు. త్యాగం, అర్పణ, వ్యక్తిగతానందాన్నే కాక మానవాళి ఆనందానికి కూడా దోహదపడుతుంది అని ఫాక్నర్ భావిస్తాడు.

మిస్టర్ ఫాక్నర్, మీరు జన్మించిన దక్షిణాదిరాష్ట్రం మా స్వీడన్ ప్రజలకు చిరపరిచితం. అందుకు మీ బాల్యమిత్రులైన టామ్‌సాయర్, హక్ల్‌బెర్రీఫిన్‌లకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. మార్క్‌ట్వైన్ తన రచనలద్వారా మిసిసిపీ నదిని ప్రపంచ సాహితీ పటంలోకి తీసుకొచ్చాడు. అతని తరువాత యాభై సంవత్సరాలకు మీరు ఆ మిసిసిపీ రాష్ట్రం నుండి ఆధునిక అమెరికన్, బ్రిటీషు సాహిత్యంలోకి మైలురాళ్ళులాంటి నవలల్ని తీసుకొచ్చారు.

మిస్టర్ ఫాక్నర్ ఇప్పుడు మిమ్మల్ని మారాజుగారి చేతులమీదుగా మా స్వీడిస్ నోబెల్ సాహితీ పురస్కారాన్ని అందుకోవలసిందిగా అభ్యర్థిస్తున్నాను.

పురస్కార ప్రదాన సందర్భంలో రాయల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ సభ్యుడైన రాబిన్ ఫారెస్ ఇలా అన్నారు. మిస్టర్ విలియం ఫాక్నర్, మీరు నోబెల్ సాహితీ పురస్కారాన్ని స్వీకరించేందుకు స్వయంగా మా దేశానికి వస్తున్నారని విని పరమానంద భరితులమయ్యాము. తటస్థంగా మానవ హృదయాంతరాళాల రహస్యాలను అతనికే విప్పి చూపి మనిషికి తనని గురించిన ఆత్మజ్ఞానాన్ని విస్తృతీకరించినందుకు మీకు నమస్కరిస్తున్నాము.

- గస్టావ్ హెల్‌స్ట్రాం

(సభ్యుడు, స్వీడిష్ అకాడెమి)

# 21వ శతాబ్దంలో తెలుగు కథ

**- డాక్టర్ దేవరాజు మహారాజు**

21వ శతాబ్దంలో తెలుగు కథ గురించి చెప్పుకోబోయే ముందు - అది ఏ సమాజం నుంచి వెలువడాల్సి ఉందో ఆ సమాజం గూర్చి కొద్దిగా ఆలోచించాల్సి ఉంటుంది. శతాబ్దం మారగానే ఉన్న ఫళంగా అద్భుతాలు జరిగిపోవు. ఈ శతాబ్దంలో వ్రేళ్ళు తన్నుకుని వృక్షాలైన అంశాలే వచ్చే శతాబ్దంలో మహావృక్షాలు కావొచ్చు. లేదా అనేక కారణాల వల్ల నిలువునా కుప్ప గూలి పోవచ్చు. ఏది జరిగినా అది నేటి వాస్తవంలోంచే క్రమక్రమంగా రూపుదిద్దుకోవాల్సి ఉంటుంది.

సమాజంలో మార్పులు త్వరితగతిన సాగిపోతున్నాయి. వాతావరణ పరిస్థితులు నానాటికీ దిగజారి పోతున్నాయి. మానవ సంబంధాలు సంక్లిష్ట మౌతున్నాయి. పదాలకు అర్థాలు మారి పోతున్నాయి. రాగాలు మారి పోతున్నాయి. సంగీత బాణీలు మారిపోతున్నాయి. మనిషి యంత్రానికి బానిస అయ్యాడు. డబ్బుకు బానిస అయ్యాడు. మారణాయుధాలకు మత్తు మందులకు బానిస అయ్యాడు. ఒకవైపు ఎయిడ్స్ లాంటి వ్యాధులు కొండ విరిగి మీద పడ్డట్టు పడుతున్నాయి. సామాజిక జీవనం బాధామయమై పోతోంది. ఫ్యాక్స్‌లు, పేజర్లు, సెల్యులర్ ఫోన్‌లు వాడుకలోకి వచ్చినా, అంతరీక్ష పరిశోధనలు అద్వితీయంగా కొనసాగుతున్నా, మనిషికి మనిషికీ మధ్య పెరుగుతున్న దూరాన్ని ఎవరూ తగ్గించలేక పోతున్నారు.

విజ్ఞాన శాస్త్రంలో సాధించిన విజయాలు జీవితశైలిని తద్వారా సాహిత్యశైలిని అనూహ్యంగా మార్చేస్తున్నాయి. వెలుగు తీవ్రత పెరిగిపోతున్న కొద్దీ, దాని నీడగాఢత కూడా పెరుగుతూ ఉంటుంది. గొప్ప విజయాలతో పాటు గొప్ప పరాజయాలూ మెన్నంటే వస్తున్నాయి. ప్రపంచమంతా గ్లోబల్ విలేజ్‌గా రూపొంది, సన్నిహితమౌతూ వున్న చోటే రకరకాలూగా సమాజంలో అడ్డుగోడలు పెరిగి పోతున్నాయి. గ్రహాలు తిరిగి వస్తున్న మనిషికి భూమి మీద సూక్ష్మ క్రిముల అనుగ్రహం మాత్రం లభించడం లేదు. క్లోనింగ్‌తో గొర్రెల్ని సృష్టించిన మనిషే రాజకీయ దండంతో జనాన్ని పిచ్చి గొర్రెలుగా మార్చగలుగుతున్నాడు. వార్తకు నిర్వచనం మారింది. ఒకప్పుడు జరిగింది చెప్పడం వార్త అనుకున్నాం. ఇప్పుడు జరగేది జరుగుతున్నట్లుగా అదే సమయంలో అందిస్తూ వుండడం వార్త అవుతోంది. ఒకప్పుడు భూమి తన కక్ష్యలో తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరిగేది. ఇప్పుడు టెలివిజన్ తెరల మీద తొంభైయ్యారు ఛానళ్ళుగా తిరుగుతూ, ఒక భయంకర విషసంస్కృతి చుట్టూ కూడా తిరుగుతోంది. ఈ ఉపోద్ఘాతం ఎందుకు అవసరమైందంటే - ఏరకంగా చూసినా, ఏ కోణంలోంచి చూసినా మొత్తానికి మొత్తంగా సమాజ స్వరూపమే అనూహ్యంగా మారిపోతూ ఉంది. రాబోయే 21వ శతాబ్దంలో అది మరింతగా మారిపోయే అవకాశం ఉంది. నవలలు టెలివిజన్ సీరియల్స్‌గా, కథలు సింగిల్ ఎపిసోడ్‌లుగా రూపాంతరం చెంది, జనబాహుళ్యానికి చేరడం బాగానే ఉంది. కాని, వ్యాపార ధోరణులు అందులోని సాహిత్య విలువల్ని విపరీతంగా దెబ్బతీస్తున్నాయి. ఈ క్రమంలో గొప్ప సాహిత్య రచనలు తక్కువస్థాయి టెలివిజన్ కార్యక్రమాలుగా మారిపోవడం బాధాకరమైన విషయం. 21వ శతాబ్దంలో తెలుగు కథా స్వరూపం ఎలా ఉంటుందో ఊహించడానికి ముందు సమాజంలో త్వరత్వరగా వస్తున్న ఈ మార్పులన్నింటినీ దృష్టిలో ఉంచుకోక తప్పదు.

పాత తరం రచయితలకన్నా ఇప్పటి కొత్త తరం రచయితలు ఎదుర్కొంటున్న సవాళ్ళు ఎక్కువ. అన్ని రంగాలలో దోపిడీ తన రంగు మార్చుకుంది. ఆ రంగు పోల్చుకోవడం రచయితలకు సమస్య కాకూడదు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై పోతున్నాయి. పల్లెల్ని పట్టణాలు కబళిస్తున్నాయి. ఒకవైపు టెస్ట్ ట్యూబ్ బేబీలు వస్తున్నారు. మరోవైపు రోబోట్‌లు రంగ ప్రవేశం చేస్తున్నాయి. బాల్యం నిర్దాక్షిణ్యంగా కుంచించుకు పోతోంది. వృద్ధాప్యాన్ని పట్టించుకునే నాథుడు లేడు. బాల కార్మికుల సమస్యలు రాబోయే యువతరాన్ని పొట్టన పెట్టుకుంటున్నాయి. మహిళల శారీరక దోపిళ్ళు, వరకట్నపు హత్యలు పురుష సభ్యతకు తలవంపులు తెస్తున్నాయి, ప్రశ్నార్థకాలవుతున్నాయి. మనుషులు యంత్రాలైపోయి, మానవీయ సంబంధాలు కథా కావ్యాల్లో మాత్రమే అక్కడక్కడా అపురూపంగా కనబడుతున్నాయి. సంస్కృతి - సంప్రదాయాలు ఒకవైపు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మరోవైపు రచయితల్ని నిలదీస్తున్నాయి. మూఢనమ్మకాల ముందు తలదించే వారి గూర్చి, నలుగురితో నారాయణ అని వ్యాపార ధోరణిలో పడి కొట్టుకు పోయే వారి గూర్చీ మనం మాట్లాడనవసరం లేదు. నిజాయితీగా, ధైర్యంగా ఒక నిబద్ధతో జీవితాన్ని ప్రేమిస్తూ గౌరవిస్తూ నిర్వచించదలుచుకున్న రచయితలకు మాత్రమే సవాళ్ళు ఎక్కువ. మానసిక వేదనలు, సంఘర్షణలు ఎక్కువ. ఎక్కువగా రాయలేక పోవడానికి ఎక్కువగా ఆలోచించడమే ఒక ప్రధాన కారణం కావొచ్చు.

శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన విజయాలు ఆయా రంగాలకు మాత్రమే పరిమితం కాలేదు. మొత్తానికి మొత్తంగా మానవ జీవితం పైనే ప్రభావం చూపాయి. ఫలితంగా కథా రచనలో నూతనత్వాన్ని సాధించడానికి రచయితలకు కూడా ఉపయోగపడ్డాయి. ప్రయోగాత్మకంగా రచనలు చేయదలిచిన రచయితలు ఈ విషయాన్ని గుర్తించక తప్పదు. ఒక చిన్న జీవ కణాన్ని ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపులో దర్శించగలిగినట్లుగానే రచయితలు జీవిత సూక్ష్మాలను విశాలం చేసి, విశ్లేషించి పాఠకుల ముందు గొప్పగా ఆవిష్కరించగలగాలి. ఈ అవకాశం ఈ రచయితలకే ఉంది. ఏ కాలానికి చెందిన రచయిత ఆ కాలానికి అనుగుణంగానే రచనలు, రచనలతో పాటు ప్రయోగాలూ చేయాల్సి ఉంటుంది. భాషా పాండిత్యం, రచనా సామర్థ్యం వేరువేరుగా విడిపోయినప్పటి నుండి సమాజంలోని అన్ని కోణాలనుండి, అన్ని స్థాయిల నుండి, అన్ని వర్గాలనుండి రచయితలు పుట్టుకొచ్చారు. నేటి రచయితలకు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచ జ్ఞానం, సామాజిక అవగాహన ఎక్కువ. వాటిని ఉపయోగించి వీరు రాగల కాలాలలో కొత్త ప్రయోగాలు తప్పకుండా చేస్తారు. వైజ్ఞానిక విజయాలు సాహిత్యంలో గొప్పగా చోటు చేసుకుంటాయి.

తెలుగు సాహిత్యంలో కవితా విప్లవాలున్నాయి. కథా విప్లవాలు లేవు. కాని, స్థూలంగా కథా రచన కవిత్వ మూల సూత్రాల ననుసరించే వస్తోంది. అభ్యుదయ కవిత్వ ఛాయలు పులుముకుని కథలు పుంఖాను పుంఖంగా వచ్చాయి. దిగంబర విప్లవ ధోరణులను అనుసరించి కూడా కథలు వచ్చాయి. ఇంకా ఉద్యమ రూపం దాల్చకపోయినా ఫెమినిజం, దళిత స్పృహలతో ఇవ్వాళ కొద్దో గొప్పో కథలు వస్తూనే ఉన్నాయి. నిజానికి ఇన్ని ధోరణులతో తెలుగులో కథారచన సాగుతున్నా విచారించదగ్గ విషయమేమంటే - తెలుగు కథ ఎదగాల్సినంతగా ఎదగలేదు. జరగవల్సినన్ని ప్రయోగాలు ఇంకా జరగలేదు. కవిత్వ ధోరణులను అనుసరించిన కథా సాహిత్యం ప్రయోగాలకు మాత్రం ఎందుకో

అల్లంత దూరంలోనే ఉండి పోయింది. ప్రతి ఉద్యమంలోనూ కవిత్వం ప్రధాన పాత్ర వహిస్తోంది. వివిధ రకాల ఆలోచనా ధోరణులను, వివిధ రకాల వాదాలను ప్రతిబింబించడానిక్కూడా కవిత్వమే ముందుంటుంది. కవిత్వం రాయడం సులభం కాదు గానీ, ఒక రకంగా కవిత్వం పేరుతో ఏదో ఒకటి రాయడం సులభమైపోయింది. కవిత్వం రాయడానికి గుండె బలం చాలు కథా రచనలు చేయడానికి గుండె బలం కండబలం రెండూ కావాలి. అధ్యయనం, సామర్థ్యం, ఓర్పు, నేర్పు, సృజనాత్మకత, అన్నీ సమపాళ్ళలో కలిస్తే గాని ఒక మంచి వచన రచన రాదు. దళిత స్త్రీ వాదాల గూర్చి ఎంత హోరాహోరిగా పోట్లాడుకున్నా, ఆ నేపథ్యంలోంచి తెలుగులో వెలువడ్డ సృజనాత్మక వచన రచనలు ఎంత తక్కువో మీకు తెలుసు. ఏ ఉద్యమ ఉధృత రూపమైనా సముద్రపు కెరటాలవలె పై పైన లేచి పడుతుంది. కొన్ని శాశ్వత విలువలు, జీవిత సత్యాలు, సముద్రగర్భం వలె లోతుగా నిశ్చలంగా గంభీరంగా ఉంటాయి. జీవితాన్ని నమ్ముకున్న రచయిత ఎల్లప్పుడూ ఆశించేది దీర్ఘకాలిక ప్రయోజనం.

ఎవరి ప్రయోజనాన్ని వారు ఆశించి కథనొక పనిముట్టుగా వాడుకున్నారు తప్పితే, పనిముట్టు నాణ్యత గురించి పెద్దగా శ్రద్ధ తీసుకోలేదు. ఎవరి సిద్ధాంతాల్ని వాళ్ళు జనంలోకి తీసుకుపోవడానికి కథల్ని ఉపయోగించుకున్నారు. ఉదాహరణకు కొన్ని రచయితల సంఘాలు కొన్ని కథల్ని నెత్తికెక్కించుకోకపోతే వాటికి ఈనాడు ఆ ప్రాచుర్యం, గుర్తింపూ వచ్చేదే కాదు. కొంత మంది సమీక్షకులు, కొన్ని కొన్ని పత్రికలు తమకై తాము ఏర్పరుచుకున్న కొలబద్దలతో కొన్ని కొన్ని కథల్ని ఆకాశానికి ఎత్తడం లోగడ జరిగింది. ఇప్పుడూ జరుగుతోంది. రాబోయే శతాబ్దంలో కూడా జరుగుతూ వుండొచ్చు ఆశ్చర్యం లేదు. అయితే కాలానికి ఎదురీది నిలబడగల కథలు తప్పకుండా నిలబడతాయి. అందుకు ఎవరిప్రమేయమూ అక్కరలేదు.

21వ శతాబ్దంలో ప్రయోగాత్మక కథ రాయడానికి ఏ రచయిత అయినా పూనుకుంటే అతను తనకు తాను ఒక కొత్త ఇతివృత్తాన్ని ఎంచుకుంటాడు. ఇతి వృత్తంలో కొత్త దనం లేకపోతే, పాత విషయాన్నే కొత్తగానైనా చెప్పడానికి ప్రయత్నిస్తాడు. పదాల విరుపూ మారుస్తాడు. వర్ణనలు అత్యాధునికంగా సమకాలీన జీవితానికి దీటుగా సాగిపోయేట్లు చూస్తాడు. పదాలు పాతవైనా అర్థాలు కొత్తవి స్ఫురించేలా చేస్తాడు. పాఠకుడిలోని పఠనాసక్తిని పెంచుతూనే అతడి ఊహకందని విషయాలు చెప్పడానికి ప్రయత్నిస్తాడు. సులభమైనశైలిలో పాఠకుడికి గొప్ప విషయాలు అవగతమయేట్లు చేస్తాడు. తప్పితే ప్రయోగాత్మకత పేరుతో పాఠకుడినెత్తిన సంక్లిష్టతల్ని రుద్దడు. తన ప్రయోగాత్మకత పాఠకుడిలో కొత్త ద్వారాలు తెరిచేట్లుగా ఉండాలని కోరుకుంటాడు. కాబట్టి రచయిత తనకు తాను ఒక కొత్త form ను ఒకకొత్త **frame** ను తయారు చేసుకుంటాడు. దానికి జనామోదం లభిస్తే ప్రయోగం విజయవంతమైందని సంతోషిస్తాడు.

కథారచనలో మెళుకువలు క్షుణ్ణంగా తెలిసినవారే అనుభవం ఉన్న వారే ప్రయోగాలు చేయగలరు. అంతకు ముందున్న formను లేదా frameను కాదని కొత్తది రూపొందించుకోవాలంటే ఆ రచయితది ఎంతో బలమయిన కలం అయివుండాలి. ఎదగని రచయితలు చేసే అపరిపక్వ రచనలు ఒక్కోసారి చిత్రంగా తోచినప్పటికీ, వాటికి ప్రయోగాత్మక స్థాయిరాదు. ఎందుకంటే ప్రయోగాత్మకతలో తప్పకుండా ఒక కొత్త పరిణతి, పరిపక్వత కనిపించాలి. వ్యాపార లాభాలు ఆశించకుండా, ఇతి

వృత్తమేదైనా జీవితాన్ని వదలకుండా చేసిన ప్రయోగాలు మాత్రమే నిలుస్తాయి. దోపిడీని చిత్రించిన కథలే గొప్పవి అని కొంత కాలంగా మనం భావిస్తూ వస్తున్నాం. నిజమే అవి గొప్పవే! కాని, అంత ముఖ్యమైన విషయాలు మరికొన్ని కూడా ఉన్నాయన్న విషయం రాబోయే తరాల్లోని రచయితలు శీఘ్రగతిన గుర్తిస్తారు. జీవావరణ విధ్వంసం, పర్యావరణ పరిరక్షణ-కాలుష్యం వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. కొత్తకొత్త వ్యాధుల గూర్చి, ఎదురుతిరుగుతున్న నైతిక విలువల గూర్చి ప్రశ్నిస్తారు. భవిష్యత్ భయంకర వికృత రూపాన్ని ముందుగానే జనం ముందుంచి హెచ్చరిస్తారు. బాధ్యతగల కథారచయితలు ఏకాలంలోనైనా కొద్దిమందే ఉంటారు. వారే కొత్త సమాజానికి ప్రతినిధులుగా సరికొత్త కథలు రాస్తారు. ఆ అవసరాన్ని గుర్తిస్తారు. ఏ కాలపు రచయితకైనా కాలానికి అణుగుణంగా నడుస్తూ కాలాన్ని అధిగమించే కథా సాహిత్య సృష్టి కోసం కృషి చేయాల్సి ఉంటుంది కదా?

కథకు వున్న **Flexibility** ఎంతటిదంటే, కథలో ఒక పాత్ర జీవితాన్నంతా చిత్రించొచ్చు లేదా ఒక చిన్న సంఘటనతో జీవితాన్నంతా బొమ్మ కట్టించొచ్చు లేదూ - ఆపాత్ర ఆంతరంగిక చిత్రణతో కూడా న్యాయం చేకూర్చవచ్చు. అదీగాక, బాహ్య అంతర ప్రపంచాలకు సమన్వయం కూరుస్తూ కూడా సాగిపోవచ్చు.

1940-50లలోని కథలలో ఒక పాత్ర జీవితమంతా కనిపించేది. ఆనాటి సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులన్నీ దానికి నేపథ్యాలయ్యేవి. రానురాను ఇటు రచయితల జీవితాల్లోనూ, అటు పాఠకుల జీవితాల్లోనూ వేగం పెరగడం వల్ల కొన్ని కొన్ని సంఘటనలు మాత్రమే కథలకు ఇతివృత్తాలయ్యాయి. ఇరవై ఒకటవ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న ఈ తరుణంలో **super specialities culture** పెరిగి పోతున్న ఈ తరుణంలో ఒక అతిచిన్న అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని కథ రాయగల నేర్పు రాబోయే కథకులు సాధిస్తారు. అంశం చిన్నదైనా అందులోంచి ఒక జీవిత స్వరూపాన్ని దర్శింప జేయగలుగుతారు. ఈ రకంగా 'చిన్నకథ' మరింత ప్రాచుర్యంలోకి వచ్చే అవకాశం ఉంది.

ఉద్యమాలు, సంఘర్షణలు, పోరాటాలు, దృక్పథాలు మానవ జీవితంతో పాటు మనుగడ సాగిస్తాయి. వాటి స్వరూపం మారుతుంది. స్వభావాలు మారతాయి. కాని కొన్ని విశ్వజనీనమైన అంశాలకు అన్ని కాలాలలో ప్రాధాన్యత ఉంటూనే ఉంటుంది. 'మానవత్వం' అనే ఇతివృత్తం ఎల్లాగైతే నిత్య నూతనమైందో వైజ్ఞానిక అవగాహన - శాస్త్రీయ దృక్పథం కూడా నిత్యనూతనమైందే. అది గత కాలంలో కూడా ఉంది. అయితే అంతర్గతంగా అప్రధానంగా కొనసాగుతూ వచ్చింది. కానీ రాగల కాలాలలో మాత్రం అది విపరీతమైన ప్రాధాన్యతను సంతరించుకుని విశ్వరూపం ప్రదర్శించనుంది. మా ప్రాణాలు అర్పించైనా సరే ఈ చెట్లను కొట్టకుండా కాపాడుకుంటాం. అని అడవుల్లో ఆదివాసులు తెచ్చిన చిప్‌కో ఉద్యమం ఏ ఉద్యమానికీ తక్కువది కాదు. కర్మాగారాలు వదిలే విష రసాయనాల వల్ల తాము తాగే మంచి నీరు కూడా కలుషితమై పోతోందని గ్రామాల్లో, మురికి వాడల్లో జనం ప్రభుత్వాల్ని నిలదీయడం తక్కువది కాదు. పెస్టిసైడ్ కర్మాగారాల్లో గ్యాస్ లీకేజ్, చమురు బావులు అంటుకుని తగలబడి పోవడం... కొన్ని కొన్ని ప్రాంతాల్ని నిర్వీర్యం చేస్తున్నాయి. ఆ దుష్ప్రభావాలు భవిష్యత్తులోకి చొచ్చుకుపోతున్నాయి. మరోవైపు స్వంత సాంకేతిక పరిజ్ఞానంతో దేశం అంతరిక్షంలోకి ఉపగ్రహాల్ని పంపుతోందని మాత్రమే తెలుసు. వాటి ఉపయోగాలు సామాన్య జనానికింకా పూర్తిగా తెలియవు.

కిరాణా కొట్లో సైతం డబ్బులు వసూలు చేయడానికి కంప్యూటర్లే మన ముక్కు పిండుతున్నాయి. ఊపిరి కోసం మనం మాస్కులు ధరించాల్సిన హీన స్థితిలోంచి బయట పడాలి. ఈ భూమి మీద శుభ్రమైనగాలికూడా కరువౌతున్న విషమ స్థితిలో ఇంకా ప్రేమలు, రాగద్వేషాలు, కుటుంబ సమస్యలు, దోపిడి, వర్గపోరాటాలు, వివిధ వాదాలు తెలుగు కథానికను సుసంపన్నం చేయలేవు. ఇకముందు కథ ఆ పరిధుల్ని దాటి, వినూత్నమైనశైలిలో కొత్త అంశాలతో కొత్త పార్శ్వాల్ని తడమాల్సిన అవసరం ఉంది. ఆ పని విశాల దృక్పథం, వైజ్ఞానిక స్పృహ గల కొత్త తరం రచయితలు మాత్రమే చేయగలుగుతారు. ఈ కొత్త సమస్యలకు సరికొత్త పరిష్కారాలు చూపిస్తూ సమాజాన్ని భవిష్యత్తులోకి నడిపించ గలుగుతారు. తెలుగు కథను 21వ శతాబ్దంలోకి తీసుకువెళ్ళే ప్రయత్నంలో.రచయితలు కృషి చేయడం ప్రారంభించాలి. ప్రపంచంలోని పలు ప్రాంతాలు తిరిగి కొత్త అనుభవాలతో తెలుగు కథకు కొత్త ద్వారాలు తెరవాలి. కొత్త వాతావరణాన్ని తేవాలి. గ్రహాంతర యానం, వ్యాధులతో వచ్చే సంవేదనలు, ఫలితంగా మానవ సంబంధాలలో వచ్చే మార్పులు తరాల అంతరం, వేగవంతమయిన జీవితంలో పెరిగిన పనిభారం నగర జీవితంలో ఒంటరితనం, పని ఒత్తిడి, అవిశ్రాంత జీవనం, కొత్త వంగడాలు, కొత్తవైరస్‌లు, కొత్త సంబంధాలు, కృత్రిమ అవయవాలు, మానవ యంత్ర సంబంధాలు, రాకెట్‌లు, సాటిలైట్ లింక్‌లు, మారుతున్న భాషా సంస్కృతుల ప్రభావాలు, ఓజోన్ పొర, ప్రళయాలు, ప్రకంపనలు వంటి అనేకానేకవైజ్ఞానిక అంశాలకు రాగల శతాబ్దంలో తప్పకుండా ప్రాధాన్యత పెరగనుంది. ఇవన్నీవైజ్ఞానిక అంశాలే అయినా సామాజిక సమస్యలుగా రూపుదిద్దుకుని మనముందుకు వస్తున్న విషయాన్ని మనం గమనించక తప్పదు.

పాపులర్ సైన్స్‌కు విపరీతంగా ప్రజాదరణ లభిస్తున్న ఈ దశలో దాని ఛాయలు అటు కవిత్వం మీదా, ఇటు కథల మీదా, నవలల మీదా చాలా బలంగా పడుతోంది సందేహం లేదు. వివిధ వాదాలు, సిద్ధాంతాలు, రచయితల్ని విడదీస్తాయి. వైజ్ఞానిక స్పృహ వివిధ వాదాల రచయితల్ని ఒక చోటికి చేరుస్తుంది.

స్థూలంగా ఇవీ నా అభిప్రాయాలు. వీటిని బలపరచడానికి ఏవో కొన్ని కథల్ని మాత్రమే ఉదహరించే వ్యర్థ ప్రయత్నం నేనిక్కడ చేయలేదు. ఎందుకంటే ఒక ప్రవాహం గురించి మాట్లాడుతున్నప్పుడు దానికి ఇరువైపులా ఉండే రమణీయ దృశ్యాలు, దర్శనీయ స్థలాల పైకి దృష్టి సారిస్తే సమయం ఎక్కువ పడుతుంది. దృష్టి - ప్రవాహ వేగం మీదే ఉంచి, నాకు ముఖ్యమని తోచిన కొన్ని అంశాల్ని మాత్రమే చెప్పడానికి ప్రయత్నించాను.

విస్తృతార్థంలో ఈ ఇంటిని కాపాడుకోవడమన్న భావనతో జన చైతన్యాన్ని తెచ్చే గురుతరమైన బాధ్యత రాబోయే 21వ శతాబ్దంలోని కథారచయితల మీదే ఉంది!

ఈ ఇంటిని కాపాడుకోవడమంటే / నీ భూమిని నువ్వు కాపాడుకొమ్మని-
ఈ ఇంటిని కాపాడుకోవడమంటే / నీ సమాజాన్ని నువ్వు కాపాడుకొమ్మని -
ఈ ఇంటిని కాపాడుకోవడమంటే / నీ కథను నువ్వు కాపాడుకొమ్మని -
ఈ ఇంటిని నిలబెట్టు కోవడమన్నది అందరి బాధ్యత!

# ''వజ్రసూచి - వివరణ''

**- టి. రవిచంద్**

వర్ణ వ్యవస్థను తీవ్రంగా ఖండించిన మహాకవి అశ్వఘోషుని సంస్కృత గ్రంథం వజ్రసూచిని ఆంగ్లంలోకి సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ అనే భారతీయుడు అనువాదం చేసి, ప్రచురించి యాభై సంవత్సరాలయింది. అంతకు ముందు పాశ్చాత్య సంస్కృత పండితులు చేసిన ఆంగ్లానువాదాలున్నా 1949వ సంవత్సరంలో సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ చేసిన అనువాదం చాలా విశిష్టమైనది.[1] ఆయన కేవలం వజ్రసూచిని సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువాదం చేయడమే కాకుండా, గ్రంథ కర్తృత్వ విషయంలో ఉన్న వివాదాన్ని ప్రాచీన సంస్కృత రాతప్రతుల్ని, చైనీస్ అనువాదాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించి, అది నిశ్చయంగా అశ్వఘోషుడి సామాజిక దర్శన గ్రంథంగా నిరూపించారు. వజ్రసూచిని తొలిసారి వెలుగులోకి తెచ్చిన పాశ్చాత్యుడు హాడ్గ్సన్ తర్వాత పేర్కొనతగినవాడు సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ. 1829వ సంవత్సరంలో నేపాలు దేశంలోని ఒక బౌద్ధుడు దీన్ని హాడ్గ్సన్ దృష్టికి తెచ్చాడు. దీన్ని ఆయన ఆంగ్లంలోకి అనువాదంచేసి 1839లో ప్రచురించాడు. పందొమ్మిదవ శతాబ్దంలో పాశ్చాత్యులు ఆంగ్లంలో రెండుసార్లు ప్రచురించారు. ఆ తర్వాత దాదాపు తొంభై సంవత్సరాలు వజ్రసూచి ప్రచురించబడలేదు. ఇంతకాలం ఏ గ్రంథమయినా మరల ప్రచురించకపోతే విస్మృతి గర్భంలో కలిసిపోవడం అనివార్యం. ఇటువంటి పరిస్థితులలో 1949వ సంవత్సరంలో సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ విశేషమైన పరిశోధనచేసి, సరికొత్త అనువాదాన్ని విశ్వభారతి అన్నల్స్‌లో ప్రచురించారు. ప్రొఫెసర్ వింటర్ నిట్జ్ తమ ''హిస్టరి ఆఫ్ ఇండియన్ లిటరేచర్'' (వాల్యుం - II) సంస్కృత సాహిత్య చరిత్రలో వజ్రసూచికి చాలా గొప్ప స్థానం ఉందని కొనియాడారు. సాహిత్య చరిత్రలోనే కాకుండా వజ్రసూచికి సామాజిక శాస్త్ర చరిత్రలో కూడా ఎంతో విలువైన స్థానం ఉంది. ఈ అంశాన్ని భారతీయ మేధావులు కాని సామాజిక శాస్త్రజ్ఞులు కాని పెద్దగా పట్టించుకోలేదు. కాని దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణేతరోద్యమ ఆవిర్భావానికి మూలకారకుల్లో ఒకరైన పండిట్ సి. ఇయోథిదాస్ వజ్రసూచి చారిత్రక ప్రాధాన్యతను గుర్తించారు. ఆయన సామాజికంగా వెనుకబడిన ''పరయ'' కులంలో జన్మించి, స్వయం కృషితో వైద్యుడిగా, గొప్ప తమిళ పండితుడిగా ఎదిగారు. తమిళ సాహిత్యంలో ఇయోథిదాస్ పాండిత్యానికి తార్కాణమే తిరుక్కురళ్‌పై ఆయన పరిశోధన. బ్రాహ్మణేతర చరిత్ర రచనా పద్ధతికి ఒకవిధంగా ఆయన్ని ఆద్యుడిగా పరిగణించవచ్చు. ఆయన చారిత్రక రచనలన్నీ తమిళంలోనే ఉన్నాయి. ఈ మధ్య వెలువడిన వి. గీత, ఎస్.వి. రాజదురైల పరిశోధనా గ్రంథం[2] ఇయోథిదాస్ నుండి పెరియార్ వరకు కొనసాగిన బ్రాహ్మణేతర ఉద్యమాన్ని దానిలో ఇయోథిదాస్ నిర్వహించిన ప్రముఖ పాత్రను చాలావరకు సమగ్రంగా పరిశీలించిందనే చెప్పాలి. దక్షిణ వేదంగా నేడు విస్తృత ప్రచారం పొందిన తిరువళ్ళువర్ 'తిరుక్కురళ్' బౌద్ధ గ్రంథంగా ఆయన నిరూపించారు. ఆయన దృష్టిలో అది తిరుక్కురళ్ కాదు తిరి - కురల్ (తిరి = మూడు). అది దక్షిణ భారతదేశంలోని తొలి బౌద్ధగ్రంథంగా ఆయన భావించారు. కురళ్

విషయ వివేచనలో బౌద్ధుల త్రిపిటకాలను పోలి ఉంటుందని అందుకే దాన్ని 'తిరికురళ్'గా పరిగణించేవారని కూడా పండిట్ ఇయోథిదాస్ పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో బౌద్ధ ధర్మ పునరుద్ధరణ బ్రాహ్మణేతర ఉద్యమంలో అంతర్భాగంగా కొనసాగింది. ఇయోథిదాస్ మహాకవి అశ్వఘోషుడి రచనల రాతప్రతుల్ని కూడా సేకరించినట్టు డబ్ల్యు. ఆర్. విజయకుమార్ లాంటి పరిశోధకులు తెలిపారు.[3] అందులో అశ్వఘోషుడి వజ్రసూచి కూడా ఉందని, అదే తర్వాతకాలంలో తమిళంలోకి అనువాదం చేయబడిందని డబ్ల్యు. ఆర్. విజయకుమార్ తమ పరిశోధనా వ్యాసంలో వెల్లడించారు. ఒక సామాజిక విప్లవోద్యమంగా బ్రాహ్మణేతర ఉద్యమం వజ్రసూచి ప్రాధాన్యతను గుర్తించింది. ఆ ఉద్యమ ప్రభావంతో స్వతంత్ర సామాజిక చింతకులుగా రూపొందిన ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు, డా॥ కె. బి. కృష్ణలు వజ్రసూచి వర్ణ వ్యవస్థను ఖండించడం ద్వారా మానవ సమానతా సూత్రాన్ని ప్రతిభావంతంగా ప్రతిపాదించిందని తమ రచనల్లో వెల్లడించారు.[4] బ్రాహ్మణేతర ఉద్యమం కాని బౌద్ధ ధర్మ పునరుద్ధరణ ఉద్యమంకాని వజ్రసూచి అశ్వఘోషుడి రచనగానే భావించాయి. ఈ ఉద్యమాల కాలంలో వజ్రసూచి గ్రంథ కర్తృత్వ విషయంలో ఎటువంటి వివాదం తలెత్తలేదు.

1947వ సంవత్సరంలో దాస్ గుప్త, ఎస్.కె.డె.లు రచించిన ''హిస్టరి ఆఫ్ సాంస్క్రిట్ లిటరేచర్''[5]లో వజ్రసూచి గ్రంథ కర్తృత్వ విషయంలో కొన్ని సందేహాలు వెలిబుచ్చారు. చైనా భాషలోకి అనువాదం చేయబడిన వజ్రసూచి ధర్మకీర్తికి ఆపాదించబడింది కాబట్టి అది అశ్వఘోషుడి రచన కాకపోవచ్చని ఈ ఇద్దరు సంస్కృత సాహిత్య చరిత్రకారులు భావించారు. అంతే కాకుండా ఇత్సింగ్ అనే చైనా యాత్రికుడు అశ్వఘోషుడి రచనలుగా పేర్కొన్న వాటిలో దీన్ని ప్రస్తావించకపోవటాన్ని కూడా వీరు మరో కారణంగా పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని ''శూద్రాస్ ఇన్ ఏన్షియంట్ ఇండియా''[6] గ్రంథంలో ప్రసిద్ధ మార్క్సిస్టు చరిత్రకారుడు ఆర్. ఎస్. శర్మ పునరుద్ఘాటించారు. ఆయన వజ్రసూచి గ్రంథ కర్తృత్వ విషయాన్ని గురించి తమ రచనలో ఇలా అంటున్నారు. ''శూద్రుల స్థితిగతుల్ని గురించి లంకావతార సూత్రం, వజ్రసూచి అనే బౌద్ధగ్రంథాలు కొంత సమాచారాన్ని అందిస్తున్నాయి. మొదటి గ్రంథం క్రీ.శ. 448లో సంకలనం చేయబడింది. కానీ రెండో గ్రంథం ఎప్పటిదో కచ్చితంగా చెప్పలేము. దీన్ని మౌర్య యుగానంతర కాలానికి చెందిన అశ్వఘోషుడు రచించినట్లు లేదు. ఈ గ్రంథాన్ని క్రీ.శ. 973-981లో బౌద్ధ తార్కికుడైన ధర్మకీర్తి చైనా భాషలోకి అనువదించాడు.''[7] (తెలుగు అనువాదం : సనగరం నాగభూషణం). ఈ గ్రంథాన్ని 1980వ సంవత్సరంలో తొలిసారి ప్రచురించారు. ఆ తర్వాత పరిష్కృత ముద్రణలు రెండు సార్లు 1980, 1990 సంవత్సరాల్లో వెలువడ్డాయి. ఇప్పటికీ ఆయన వజ్రసూచి అశ్వఘోషుడి రచన కాదనే అభిప్రాయపడుతున్నారు! 1829వ సంవత్సరంలో నేపాలులో లభించిన వజ్రసూచిని ఆంగ్లంలోకి అనువాదం చేసిన హాడ్గ్సన్ అది అశ్వఘోషుడి రచనగానే భావించారు.[8] నేపాలులో అది అశ్వఘోషుడి రచనగానే పరిగణించబడింది. 1949వ సంవత్సరంలో సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ భారతదేశంలో లభిస్తున్న వజ్రసూచి ప్రాచీన రాత ప్రతుల్ని, వజ్రసూచి చైనా భాషానువాదాన్ని

తులనాత్మకంగా పరిశీలనచేసి, చైనాలో ధర్మకీర్తి రచనగా పేర్కొనబడుతున్న వజ్రసూచి సంస్కృత మూలానికి అనువాదమా లేక మరొక స్వతంత్ర గ్రంథమా అని సందేహం వ్యక్తీకరించారు. ధర్మదేవుడు దీన్ని సంస్కృతం నుంచి క్రీ.శ. 973 - 981 ప్రాంతాల్లో చైనా భాషానువాదం చేశాడు. ఈ అనువాదం సంస్కృత మూలానికి చాలా భిన్నంగా ఉందని సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ తమ పరిశోధనలో కనుగొన్నారు. సంస్కృత మూలానికి భిన్నంగా చైనా భాషానువాదంలో అనేక మార్పులు, చేర్పులతో పాటు మూలంలో లేని తప్పులు కూడా ఉన్నాయని అందువల్ల అది వేరొక రచన కావచ్చని తగిన సాక్ష్యాధారాలతో భావించారు. అందుకే చైనాలో లభిస్తున్న వజ్రసూచిని గురించి ఆయన ఇలా అన్నారు **"It appears to be a different text, a similar work of the same nature, probably an adaptation of original Vajrasuchi by Dharmakirti, who is said to be its author, in the Chinese translation. So we do not find any definite evidence against Asvaghosha being the author of the Sanskrit" (Introduction P. XII)**[9]. కాబట్టి ఎప్పుడో 1947వ సంవత్సరంలో వజ్రసూచి చైనా భాషానువాదాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించకుండా దాస్ గుప్త, ఎస్.కె.డె. లు వచ్చిన అభిప్రాయాన్ని ఆర్. ఎస్. శర్మ సమర్థించడం చూస్తుంటే ఆశ్చర్యకరంగా ఉంది. ఈ ఐదు దశాబ్దాల కాలంలో దేశ, విదేశీ సంస్కృత చరిత్రకారులు, పండితులు అశ్వఘోషుడి రచనలపై, ముఖ్యంగా వజ్రసూచిపై అనేక పరిశోధనలు చేశారు.[10] ఈ పరిశోధనలన్నీ వజ్రసూచి అశ్వఘోషుడి రచన కాదనే వారి వాదనను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఈ పరిశోధకులందరూ మూలాధారాలపై ఆధారపడి తమ పరిశోధనలు చేశారు. ముఖ్యంగా సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ చైనాలో లభిస్తున్న వజ్రసూచిని సమగ్రంగా పరిశీలించడమే కాకుండా భారతదేశంలో లభిస్తున్న వివిధ ప్రాచీన వజ్రసూచి రాతప్రతుల్ని విశ్లేషించారు. ఈ ప్రాచీన (ఆరు) రాతప్రతులు వజ్రసూచి అశ్వఘోషుడి రచన అనే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి **(All these Manuscripts attribute the work to Asvaghosha P. XI)**[11]. ఈ గ్రంథంలోని ప్రారంభ శ్లోకం ( అశ్వఘోషో వజ్రసూచీం సూత్రయామి యథామతం) గ్రంథాంత గద్యం ( కృతిరియం సిద్ధాచార్యాశ్వఘోషపాదానామితి). రాత ప్రతుల్లోని ఈ ఆధారాల ద్వారా అశ్వఘోషుడే దీని రచయితగా గుర్తించవచ్చు. వజ్రసూచిని అశ్వఘోషుడి రచనగా భావిస్తున్న ఈ రచయితలంతా బహుభాషా పండితులు ( సంస్కృతం, టిబెట్, జపాన్, చైనా లాంటి భాషలు తెలిసిన వారు). ఆయా భాషల్లో లభిస్తున్న మూల గ్రంథాల్ని, అనువాదాల్ని నిష్పాక్షికంగా పరిశీలించి వజ్రసూచి అశ్వఘోషుడి రచనగా ఈ పండితులంతా అభిప్రాయపడ్డారు. దేశ, విదేశీ పండితులు అందరిలో దాస్ గుప్త, ఎస్.కె.డె. లు వారి ప్రతిధ్వని ఆర్. ఎస్. శర్మలు తప్ప మరొకరు ఇది అశ్వఘోషుడి రచన కాదనడం లేదు. వజ్రసూచిని తొలిసారి వెలుగులోకి తెచ్చిన పాశ్చాత్యుడు బి. హెచ్. హాడ్జ్‌సన్ (1929) నుంచి అమెరికన్ ఇండాలజిస్ట్ డేనియల్ బిస్‌గార్డ్[12] (1994) వరకు సంస్కృత సాహిత్య చరిత్రకారులంతా వజ్రసూచి అశ్వఘోషుడి రచనగా భావించినవారే. ఈ పరిశోధనలు, వాదనలు ఏవీ వామపక్ష చరిత్రకారుడైన ఆర్. ఎస్. శర్మ దృష్టికిరావు.

ఒకవేళ ఆయన దృష్టికి వచ్చినా వజ్రసూచి అశ్వఘోషుడి రచన కాదని నిరూపించాలన్న దృఢ సంకల్పంతో ఉన్న ఈ వామపక్ష రచయితకు అవి ఎలా ఆమోదయోగ్యమవుతాయి. డా॥ అంబేద్కర్ లాంటి పండితుణ్ణి పూర్తిగా అనువాద గ్రంథాలపై ఆధారపడి ''శూద్రులెవరు'' అనే గ్రంథాన్ని రచించారని తేలికగా తీసిపారేసిన ఆర్. ఎస్. శర్మకు చైనా భాష తెలుసా? ఆయన చైనా భాషలోకి అనువాదమయిన వజ్రసూచిని, సంస్కృత మూలాన్ని తులనాత్మకంగా పరిశీలించే అది అశ్వఘోషుడి రచన కాదని చెప్పారా? లేక దాస్ గుప్త, ఎస్.కె.డె.ల అభిప్రాయాన్నే పునరుద్ఘాటించారా? ఆర్. ఎస్. శర్మ ''శూద్రాస్ ఇన్ ఏన్షియంట్ ఇండియా'' గ్రంథాన్ని చదివిన పాఠకులందరికీ ఆయన ఈ అభిప్రాయానికి ఎలా వచ్చింది తెలుసు. ఈ వామపక్ష చరిత్రకారుడు తన అభిప్రాయాలకు అనుగుణంగా ఒకే గ్రంథంలో ఒక విషయంపై ఒక అధ్యాయంలో ఒక అభిప్రాయాన్ని, మరొక అధ్యాయంలో మరొక అభిప్రాయాన్నీ ఎటువంటి సంకోచం లేకుండా వ్యక్తీకరించగలడు. వామపక్షాభిమానులంతా అది పరమ ప్రమాణ పరిశోధనా గ్రంథంగా భావించగలరు! ''ప్రాచీన భారతంలో శూద్రులు'' గ్రంథంలో ఒక అధ్యాయంలో చంద్రగుప్తుణ్ణి ''క్షత్రియజాతిలోని మోరియా వంశానికి చెందినవాడి''గా చిత్రించి, మరో అధ్యాయంలో ''శూద్రసంజాతుడైన చంద్రగుప్తుడు''[13] అని చిత్రిస్తాడు. ఒకే గ్రంథంలో తన స్వీయాభిప్రాయాలకు సమర్థనగా చంద్రగుప్తుణ్ణి క్షత్రియుడిగాను, శూద్రుడిగాను చిత్రించగలిగిన పాండిత్యం, ప్రతిభ డా॥ అంబేద్కర్‌కు లేవు. ఆయన అనువాదాలపై ఆధారపడ్డా, మూలగ్రంథాలపై ఆధారపడ్డా తర్కం కోసమో, పాండిత్య ప్రదర్శన కోసమో పరిశోధనలు, గ్రంథ రచనలు చేయలేదు. నిర్దిష్టమైన సామాజిక లక్ష్యంతో డా॥ అంబేద్కర్ చారిత్రక రచనలు చేశారు. ఒకవేళ ఆయన సంస్కృత మూలగ్రంథాలపై ఆధారపడి రచనలు చేద్దామన్నా అస్పృశ్యుడిగా పుట్టిన ఆయన దేవ భాషయిన సంస్కృతం నేర్చుకోరాదని హిందూ సమాజం నిషేధం విధించింది కదా! ప్రాథమిక విద్యార్థిగా ఉన్నప్పుడే డా॥ అంబేద్కర్ సంస్కృతం నేర్చుకోవాలని ఎంతో ఆసక్తి కనబరిస్తే, ఈ హిందూ సమాజం ప్రతిఘటించ లేదా? అందువల్ల విద్యార్థి దశలో ద్వితీయ భాషగా సంస్కృతం స్థానంలో మ్లేచ్ఛ భాషగా పరిగణించబడే పర్షియన్ భాషను నేర్చుకున్నాడు. ఈ దేశంలో పుట్టినా కులం కారణంగా ఈ దేశ భాషను నేర్చుకొనే అర్హతను కోల్పోయిన ఆయన విదేశీ భాషను నేర్చుకున్నాడు. ఈ విషయంపై డా॥ అంబేద్కర్ ఏమన్నారో చూడండి **"Though I had the eager desire to learn Sanskrit, I was forced to leave it on account of the narrow attitude of our teachers"**[14]. ఇటువంటి సంకుచిత హిందూ సమాజంలో పుట్టిన ఆయన సంస్కృతం చిన్నవయస్సులో నేర్చుకోలేకపోయినా, తర్వాత స్వయంకృషితో కొంత నేర్చుకున్నారు. పాళీ లాంటి ప్రాచీన భాషలో గొప్ప పాండిత్యం సంపాదించి, ఆ భాషా నిఘంటు, వ్యాకరణం[15] కూడా రచించే స్థాయికి ఆయన ఎదిగారు. పుట్టుక కారణంగా ఎన్నో అదనపు అర్హతలు సంపాదించిన ఆర్. ఎస్. శర్మ లాంటి వారు, పుట్టుక కారణంగా ఎన్నో అనర్హతలకు గురయిన డా॥ అంబేద్కర్ గురించి, ఆయన రచనల గురించి అంత చులకనగా మాట్లాడాల్సింది కాదు. అటువంటి వ్యక్తులు

రచించిన గ్రంథాలను ఎంతో సానుభూతితో, సహానుభూతితో పరిశీలించాల్సింది పోయి, ఈ వామపక్ష చరిత్రకారుడు సనాతన ఛాందస పండితుడి మాదిరి చులకనగా మాట్లాడటం అరుంధతిరాయ్ అన్నట్లు కాక్ టెయిల్ రివల్యూష నరీస్‌కే చెల్లుతుంది. సామాజిక విప్లవ దర్శనాన్ని దాదాపు పద్దెనిమిది వందల సంవత్సరాల క్రితమే ప్రతిభా వంతంగా ప్రదర్శించిన వజ్రసూచిని ఈ మార్క్సిస్టు చరిత్రకారుడు చర్చించాల్సిన పద్ధతిలో చర్చించకుండా తన పాండిత్యంతో అసలు విషయాన్ని చాలా తెలివిగా దారిమళ్ళించాడు. చైనాలో ఉన్న వజ్రసూచి అశ్వఘోషుడి దయినా, ధర్మకీర్తి దయినా పెద్ద నష్టం లేదు. ఎందుకంటే ఇద్దరూ ప్రసిద్ధిచెందిన బౌద్ధులే. అశ్వఘోషుడు వర్ణవ్యవస్థను నిరసించాడు; ధర్మకీర్తి నిరసించాడు. కాకపోతే ధర్మకీర్తి పేరుతో ఉన్న చైనీస్ వజ్రసూచి వర్ణవ్యవస్థతో పాటు హిందువులు పరమ ప్రమాణంగా, పరమ పవిత్రంగా భావించే నాలుగు వేదాల్ని కూడా తిరస్కరించింది. అదే మౌలికమయిన భేదం! కాని ఆర్. ఎస్. శర్మ వజ్రసూచిని పేర్కొన్నది అది వర్ణ వ్యవస్థను ఎలా ఖండించిందో, నిరసించిందో చెప్పడానికి కాదు. ఆయన తన పరిశోధనాంశమయిన ప్రాచీన సంస్కృత గ్రంథాలలో శూద్రుల స్థితిగతుల గురించి ఆ గ్రంథాలు ఎలా చిత్రించాయో పాఠకులకు తెలియచేయడానికే! ఒక పరిమిత లక్ష్యం కోసం అపరిమిత సామాజిక ప్రయోజానాన్ని తనలో ఇముడ్చుకున్న వజ్రసూచిని ఆర్. ఎస్. శర్మ తన యాంత్రిక మార్క్సిస్టు దృష్టితో ఉపయోగించుకోవడానికి ప్రయత్నం చేశాడు. ఇది చాలా బాధాకరమయిన విషయం. సమకాలిక మార్క్సిస్టు చరిత్రకారుల్లో మంచి గుర్తింపు, గౌరవం ఉన్న ఇటువంటి చరిత్రకారుడు రాసే ప్రతి మాట వామపక్షవాదుల్ని ప్రభావితం చేస్తుంది. అందుకే ఇంత వివరణాత్మక పరిశీలన. స్వంత బుద్ధి, స్వతంత్ర ఆలోచన లేని ఈ ఉద్యమాభిమానులు, కార్యకర్తలు, ఒకస్థాయి మేధావులు కూడా ఇటువంటి చరిత్రకారుల అభిప్రాయాల్ని చిలకపలుకుల్లా పలుకుతుంటారు.

వజ్రసూచి భారతీయ ఆంగ్లానువాదం ప్రచురించి యాభై సంవత్సరాలయినా, ఈ దేశంలోని ప్రగతిశీల ఉద్యమాలు ఈ గ్రంథం చారిత్రక ప్రాధాన్యతను, సమకాలిక అవసరాన్ని గుర్తించి, దీనిలోని సామాజిక విప్లవ భావజాలాన్ని సరిగా వినియోగించుకోలేకపోయారనే చెప్పాలి. తెలుగులో బౌద్ధదర్శనంపై ఉద్గ్రంథాలు రాసే మేధావులు సయితం, అశ్వఘోషుడి సామాజిక దర్శనాన్ని గురించి ఒక్క మాటయినా రాయకపోవడం ఆశ్చర్యం కలిగించక తప్పదు. ''కొద్ది పాండిత్యం అత్యంత ప్రమాదకరమ'' ని మన పెద్దలు ఊరకనే అనలేదు. ఇటు వర్గవాదులు, అటు వర్ణవాదులు ఈ గ్రంథం ప్రాశస్త్యాన్ని గుర్తించకపోవడానికి కారణం వారి దృష్టి లోపమే కాని వజ్రసూచి లోపం ఏమాత్రం కాదు.

(సశేషం)

# మహాప్రజ్ఞానిధి ఆశుతోష్ ముఖర్జీ

**- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

లార్డ్ కర్జన్ వైస్రాయ్‌గా (1899-1905) మనదేశాన్ని ఏలుతున్న కాలమది. కరుడు గట్టిన సామ్రాజ్యవాది కర్జన్. అతని ఆదేశాలను ఉల్లంఘించేవారు చాలా అరుదుగా వుండేవారు. అట్టి అరుదైన ఆత్మాభిమానులలో అగ్రగణ్యుడు ఆశుతోష్ ముఖర్జీ.

'మాతృదేవోభవ' అన్న సూక్తిని అక్షరాలా పాటించిన ధీరుడు యువ ఆశుతోష్. కలకత్తా విశ్వవిద్యాలయ పట్టపరీక్షలో సర్వప్రథముడుగా ఉత్తీర్ణుడైన ఆశుతోష్ ముఖర్జీని ఉన్నత విద్యకై ఇంగ్లండు పంపాలనుకొన్నాడు లార్డ్ కర్జన్. తన అభిప్రాయాన్ని సర్‌జాన్ ఉడ్‌బర్న్ ద్వారా తెలియజేశాడు. ఆశుతోష్ తన నిర్ణయాన్ని తెలుపుతూ, ''మా తల్లిగారు సముద్ర యానం చేయవద్దన్నారు. ఆమె ఆదేశాన్ని శిరసా వహిస్తున్నాను. వైస్రాయ్‌గారి ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నాను'' అన్నాడు. సర్‌జాన్ ఎంత చెప్పినా, వీలుకాదన్నాడు. ఆశుతోష్ నిర్ణయాన్ని వైస్రాయ్‌కి నివేదించాడు. లార్డ్‌కర్జన్ ఆశుతోష్‌ను పిలిపించి, మా ఆదేశాలను మన్నించి విదేశం వెళ్ళవలసిందే, అన్నాడు 'మాతల్లి మాటమీరను' అన్నాడు ఆశుతోష్ **"Then tell your mother that the viceroy and governor-general of India commands her son to go"** అన్నాడు కర్జన్. ఆశుతోష్ ఏమాత్రం జంకకుండా వెంటనే **"Then I will tell the viceroy of India on her behalf that the mother of Ashutosh Mukherji refuses to let her son be commanded by any body excepting herself be he the Viceroy of India or be he anybody greater"** అన్నాడు. యువకుని మాతృభక్తికి ముగ్ధుడైన లార్డ్ కర్జన్ నిశ్చేష్టుడయ్యాడు.

ఆశుతోష్ ముఖర్జీ బహుముఖ ప్రజ్ఞావంతుడు. గణిత, న్యాయశాస్త్రాలలో దిట్ట. కొంత కాలం కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశాడు. ప్రాచీన విజ్ఞానమును జీర్ణించుకున్నవాడు. వంగ, సంస్కృత, ఆంగ్లభాషలలో నిష్ణాతుడు.

స్వాతంత్ర్యానికి, జాతీయతకు, మానవతకు పర్యాయపదంగా వెలిగిన ప్రజ్ఞానిధి ఆశుతోష్, కలకత్తా విశ్వవిద్యాలయాన్ని కన్నబిడ్డగా ప్రేమించి పెంచినవాడు. జాతిమత భేదములను విస్మరించి ప్రజ్ఞాధురీణులను కలకత్తా విశ్వవిద్యాలయాచార్యులుగా నియమించాడు. సర్. సి. వి. రామన్, సర్. సర్వేపల్లి రాధాకృష్ణులను తన విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగ నియమింపచేసిన మహనీయుడు ఆశుతోష్ ముఖర్జీ. ఈతని పుత్రులు రామాప్రసాద్, శ్యామ్‌ప్రసాద్ (భారతీయ జనసంఘ స్థాపకులు, కేంద్రమంత్రి) అల్లుడు ప్రమథ నాథ్‌లు కలకత్తా విశ్వవిద్యాలయాచార్యులుగా వుండేవారు. కూతురు అకాలమృత్యువుకు గురికాగా, ఆమె స్మారక చిహ్నంగా నలుబది అయిదు వేల రూపాయల నిధితో 'కమలా లెక్చర్స్' ఏర్పాటు చేశాడు. డా॥ ఆనీబెసెంట్, రైట్ ఆనర్‌బుల్ వి. యస్. శ్రీనివాసశాస్త్రి వంటి మహామేధావులు 'కమలా లెక్చర్స్' ఇచ్చారు.

'బెంగాల్‌పులి'గా పేరుగాంచిన ఆశుతోష్ ముఖర్జీ తన విశ్వవిద్యాలయం (కలకత్తా విశ్వవిద్యాలయం) ''గులామ్‌ఖాన్'' (బానిసల భవనం) కాక స్వాతంత్ర్యోపాసకుల ఆలయం కావాలని ఆశించాడు. 1923లో జరిగిన స్నాతకోత్సవ సభలో వైస్రాయి లార్డ్ లిట్టన్ ఎదుట ఉపన్యసిస్తూ 'Freedom first, freedom second freedom always. Nothing else will satisfy me" అని గర్జించిన దేశభక్తుడు ఆశుతోష్.

ఆశుతోష్ ముఖర్జీ స్వంత గ్రంథ భాండారము అత్యంత విలువైనది. ఈనాడు భారతజాతీయ గ్రంథాలయంలో 30 లక్షల గ్రంథాలున్నాయి. ఆశుతోష్ ముఖర్జీ తండ్రి డా॥ గంగాప్రసాద్ ముఖర్జీ ప్రముఖ వైద్యుడు. తన కుమారునికి కానుకగా ఆయన ఎన్నో ఉత్తమ గ్రంథాలను అందించాడు. తండ్రి అడుగు జాడలలో నడచిన ఆశుతోష్ తన గ్రంథ రాశిని పెంపొందిస్తూ 85 వేలకుపైగా విభిన్న గ్రంథాలను సేకరించాడు. సేకరించిన ప్రతి గ్రంథాన్ని చదివాడు. ఆశుతోష్ ముఖర్జీ దివంగతులైన తర్వాత, వారికుమారులు, ఆ గ్రంథభాండారాన్ని కలకత్తాలోని జాతీయ గ్రంథాలయానికి దానంగా ఇచ్చారు. తన గ్రంథాలను ప్రత్యేకంగా ఉంచాలని, ఏ పరిస్థితులలో కూడా వాటిని కలకత్తా నుండి తరలించరాదన్న నియమాలకు నాటి కేంద్ర విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సమ్మతించాడు.

1887లో భారత సర్వేయర్ జనరల్ మరణానంతరం అతని స్వంత గ్రంథాగారంలోని పుస్తకాలు వేలం వేయబడ్డాయి. ఆసంచయనంలోని అపురూపమైన ఫ్రెంచి భాషలోని గణిత శాస్త్ర గ్రంథాలు రెండింటిని కొనాలని ఆశుతోష్ ఆశించాడు. జస్టిస్ ఓకెన్లీ ఆ గ్రంథాలను కొనాలనుకొన్నాడు. వేలం పాటలో ఎక్కువ మొత్తం పాడి జడ్జి ఆరెండు పుస్తకాలను తీసుకొన్నాడు. యువన్యాయవాదిగ ఉండి ఆశుతోష్ ఆసక్తిని తెలుసుకొని జడ్జి ఆ పుస్తకాలను ఆశుతోష్‌కు కానుకగా ఇచ్చాడు.

ఆశుతోష్ ముఖర్జీ అతిఖరీదైన పుస్తకాలను విదేశాల నుండి తెప్పించుకొనేవాడు. చాలా అపురూపమైన ఆంగ్ల, సంస్కృత, ఫ్రెంచి గ్రంథాలను ఆయన కొనేవాడు. కలకత్తాలోని జాతీయ గ్రంథాలయ భవనంలోని నాలుగవ అంతస్తులో ఆశుతోష్ ముఖర్జీ గ్రంథభాండాగారం ఎంతో భద్రంగా నిర్వహింపబడుతోంది. ఈ విభాగంలోనే నలుగురు పండితులు, మరో నలుగురు సహాయకులు పని చేస్తున్నారు.

గ్రంథ పఠనం పాత సాంప్రదాయంగా భావింపబడింది. దృశ్య - శ్రవణ సాధనాల మోజులో పడిన నేటి పాఠకులు పుస్తక పఠనంలో నిరాసక్తులవుతున్నారు.

విశ్వ విద్యాలయాలు కేవలం పరీక్షల కొరకు ఏర్పడిన సంస్థలు కాక ప్రజ్ఞాధురీణులను మహా విజ్ఞానులను రూపొందించే విశ్వవిద్యాలయాలుగా పెంపొందాలన్న దృఢ సంకల్పంతో కలకత్తా విశ్వవిద్యాలయానికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను సంతరించిన మహనీయుడు సర్ ఆశుతోష్ ముఖర్జీ.

# కవిత్వము - ప్రక్రియ

- డా॥ యు. ఎ. నరసింహమూర్తి

కవిత్వానికి కొన్ని మూలకాలున్నాయి. అందులో ప్రక్రియ ఒకటి. సంప్రదాయాన్ని బట్టి ఆచారాన్ని బట్టి అనూచానంగా కొనసాగివచ్చే కొన్ని సాహిత్యసూత్రాలు, ఒడంబడికల కారణంగా ఏర్పడిన రచనా విధానాన్ని ''ప్రక్రియ'' అంటారు. ప్రక్రియకు రచయితతో, రచనాకాలంతో సంబంధం ఉండదు. ఒకప్పుడది దేశకాల వ్యక్తి పరిధులను దాటుకొని పోతుంది. ఒక కవి ఒక రచన చేస్తాడు. దానిని అదే విధంగా రాసిన ఇతర రచయితల రచనలతో జతచేసి మనం ఆ రచనాక్రమానికి సంబంధించిన కొన్ని సామాన్యలక్షణాలను నిర్ణయిస్తాము. అప్పుడది ఒక ప్రక్రియగా గుర్తింపు పొంది స్థిరపడుతుంది.

కవులు, పాఠకులు తమకు వారసత్వంగా సంక్రమించిన ఒడంబడికల ననుసరిస్తూ ఉంటారు. అందుచేత ఒక రచనను ఒక ప్రక్రియగా నిరూపిస్తున్నప్పుడు మనం రచయిత ఉద్దేశించిన అర్థానికి సన్నిహితంగా వస్తున్నామని అనుకోవాలి.[1] ఒక పదానికి ఎన్నో ధ్వనులున్నట్లే ఒక ప్రక్రియకు ఎన్నో ఇతరేతర సంబంధాలుంటాయి. కవి సాధన మార్గంలోని ప్రత్యేకతను, సమగ్రతను అర్థం చేసుకునే పాఠకుడి గ్రహణకు పదునుపెట్టేది ప్రక్రియ.

రూపము శిల్పము ఛందము అర్థము- అర్థపరిమితి వంటి అంశాలు కారణంగా ప్రక్రియా భేదాలేర్పడతాయి. ప్రక్రియకు సంబంధించిన స్థూల విభాగాలున్నాయి. అందులో మళ్లీ అవాంతర భేదాలను నిరూపించే సూక్ష్మరీతులున్నాయి. అన్ని రంగాలలో లాగే సాహిత్య రంగంలో కూడా వర్గ దృక్పథంతో ఏర్పడినరెండు ప్రధాన ప్రక్రియా భేదాలున్నాయి. అవి (1) మార్గ(2) దేశి మార్గ ప్రక్రియ నాగరకులకు చెందినది. దేశి ప్రక్రియ జానపదులకు చెందినది. పాఠకులు లేదా శ్రోతలను దృష్టిలో పెట్టుకుని శ్రవ్య - దృశ్య ప్రక్రియ లేర్పడ్డాయి. ఇతివృత్తంతో ప్రమేయం లేకుండా భారతీయ సాహిత్యంలో ముందు పద్య - గద్య - చంపూ ప్రక్రియా భేదాలేర్పడ్డాయి. ఇతివృత్తాన్ని బట్టి ఇతిహాసము - పురాణము. ప్రబంధము మొదలైన భేదాలేర్పడ్డాయి. నిర్మాణ శిల్పాన్ని బట్టి, కవిస్వరాన్ని బట్టి దశరూపకాలు - యక్షగానాలు - ఉదాహరణకు ఖండకావ్యము అధిక్షేప కావ్యము వంటి రీతు లేర్పడ్డాయి. ఛందస్సులోని వైలక్షణ్యాన్ని బట్టి రుబాయీలు గజళ్ల, విమరుక్కులు, పంచపదులు, గాథలు, హైకూలు వంటి భేదాలేర్పడ్డాయి. అర్థ పరిమితిని - సంఖ్యా పరిమితిని బట్టి ముక్తకము - యుగ్మకము - సందానితకము - కలాపకము వంటి భేదాలేర్పడ్డాయి. ఇలా భారతీయ సాహిత్యాలలో ఎన్నో కవితా ప్రక్రియలు. కొన్ని ప్రక్రియలు కొన్ని భాషాసాహిత్యాలకు ప్రత్యేక అలంకారంగా ఉన్నాయి. ఒక సాహిత్యంలో రూఢమై ప్రత్యేకతను సాధించి బహుళవ్యాప్తిని పొందిన ప్రక్రియను ఇతర భాషావ్యవహర్తలు అనుసరించడం ఉంది. ప్రపంచ సాహిత్యాలన్నింటిలోను ఈ ప్రక్రియా వినిమియం నిరాఘాటంగా నిర్విరామంగాను కొనసాగుతూనే ఉంది.

ప్రత్యేక ప్రయోజనంలేని ప్రక్రియా భేదం ఉండదు. ఉదాహరణకు శ్రవ్య - దృశ్య కావ్య ప్రక్రియలనే

తీసుకోండి. దృశ్యకావ్య భేదం కేవల రసదృష్టితో ఏర్పడినట్లు మన విమర్శకులు భావించేరు. భరతుడు నాట్యశాస్త్రంలో చేసిన రసచర్చ అంతా కేవలం దృశ్యకావ్య ప్రక్రియకు మాత్రమే పరిమితమై ఉంది. రసవిషయికంగా శ్రవ్యకావ్యాన్ని పరామర్శ చేయడానికి మొదట ప్రయత్నించినవాడు ఆనంద వర్ధనుడే అని శ్రీ సన్నిధానం వారు వివరించారు.[2] వర్ణ్య వస్తు భేదాన్ని బట్టి ప్రక్రియా భేదం ఏర్పడుతుందని సరస్వతీకంఠాభరణ వ్యాఖ్యాత రత్నేశ్వరుడు పేర్కొన్నాడు. ఆనందవర్ధనుడు ఏ సందర్భంలో ఏ ప్రక్రియ ఉపయోగించదగినదో ప్రబంధౌచిత్యాన్ని గూర్చిన సందర్భంలో వివరించేడు.

ప్రక్రియాభేదాన్ని గుర్తించి చదవడం - రాయడం పాఠకుడికి కవికి ఎంతో అవసరం. కాని పద్యాలు పిచ్చి గుర్రాల్లాంటివి. అవి ఎప్పుడూ క్షుణ్ణమైన మార్గంలోనే దౌడుతీస్తాయని చెప్పలేము. కవి ఇతరుపట్ల నిరంకుశుడే అయినా ఒకానొక దశలో తన పద్యానికి విధేయుడై పోతాడు. అప్పుడు తన పద్యాన్ని అదుపులో పెట్టలేడు. యథార్థానికి ఒక ఉన్నతిని సాధించిన దశలో పద్యానికి ఆ స్వేచ్ఛ అవసరం కూడా. అందుచేత ఎప్పుడూ ఒక ప్రక్రియా భేదానికి మాత్రమే పద్యం కట్టుబడి ఉంటుందని ఖచ్చితంగా చెప్పలేము[3]. కథన ప్రక్రియలో నాటకీయ - భావగీత లక్షణాలు చేరవచ్చును. నాటకీయ రచనలో కథనరీతి కాలు పెట్టవచ్చును. భావగీతాలలో కథన - నాటకీయ ధోరణులు చోటుచేసుకోవచ్చును. ఒక పద్యం కథనాత్మకమా, నాటకీయమా, భావగీతమా అన్నది మాత్రం మనం మౌలికంగా చెప్పగలము. అలా చెప్పే అవకాశం లేకపోతే అది ప్రక్రియా నిర్వహణంలోని లోపం అవుతుంది.

పాశ్చాత్యులు కవిత్వానికి సంబంధించి కథన ప్రక్రియ **(Narrative)**, నాటకీయ ప్రక్రియ **(Dramatic)**, భావగీతప్రక్రియ అనే విశాలమైన ప్రక్రియా విభజన చేసేరు. ఈ మూడు ప్రక్రియలలో తిరిగి అవాంతర భేదాలేర్పడ్డాయి. కథనాత్మక ప్రక్రియలో ఇతిహాసం **(Epic)**, ప్రణయకావ్యం **(Romance)**, వీరగాథ **(Ballad)** వంటి భేదాలున్నాయి. నాటకీయ ప్రక్రియలో స్వగతాలు **(Soliloquy)**, ఆకాశభాషణం **(Monologue)**, సంభాషణలు **(Dialogue)** వంటివి ఉంటాయి. భావ గీతాలలో స్తుతులు **(Hymns)**, విచారాలు **(Meditations)**, పాటలు **(Songs)**, స్మృతి గీతాలు **(Elegy)**, చిన్నపద్యాలు **(Sonnet)**, ఉదారానుభూతులు **(Ode)** వంటివి వుంటాయి. ఇవన్నీ ఆత్మాశ్రయ రచనలు. ఉద్వేగాలను, ఆలోచనలను, అనుభూతులను మంచి పొంగులో ఉన్నప్పుడు వెల్లడించే ప్రక్రియలివి.

ఈ ప్రక్రియలలో కొన్నింటిని నిరూపించడానికి గురజాడ కవిత్వం మనకు బాగా ఉపయోగిస్తుంది 'ముత్యాల సరాలు' చిన్న కవితా సంపుటి. అయినా గురజాడ మాటల్లో చెప్పాలంటే అది 'వితత కవితాఖని' అని చెప్పాలి. నిజంగా దానిని చూసిన 'కుమతి'కి 'కను చెదరు'తుంది. 'మతియుతుడు కవితల సొంపున్ చతురత నెరిగి గనున్'[4] అన్నాడు గురజాడ. ఆ చాతుర్యంతో చూస్తే అంత చిన్న కవితా సంపుటిలో ఏ ఇతర కవితా సంపుటిలోనూ లేనన్ని ప్రక్రియా భేదాలున్నాయని తెలుస్తుంది. ఆయన మచ్చుకొకటి చూపించడానికి ఇవన్నీ రాసేడా? అని అనిపిస్తుంది. తెలుగు కవిత్వం ఆయన చివరదశలో రాసేడు. కాని అందులో కూడా 'కొత్తపాతల మేలుకలయిక క్రొమ్మె ఱుంగులు' చిమ్మింది.

''ధృతి గురుజాడల నరిగెడు గతి - పెద్దలు జొ౯ర జనితి - గజపతి త్రోవన్'' అన్నాడు గురజాడ. ఈ గజపతి ఆనందగజపతి. అతని దర్బారులో సంస్కృతాంధ్రాంగ్ల భాషలలోనేగాక, ఉర్దూ, పారశీక భాషలలో కూడా కవి పండితులుండేవారు. గురజాడకు వారితో సత్సంబంధాలుండేవి. ఏదో పేరుకు దర్బారు చేయడంకాదు. ఆనందగజపతి ఎక్కువగా వారితో చర్చలు చేసేవాడు. గురజాడ ఆయన ననుసరించి ఉండేవాడు. ముత్యాలసరాల మీద పారశీ గజల్ల ప్రభావం ఉందని ఆయన అన్నాడు. ఆయన చెప్పకపోయినా పాశ్చాత్య కవితా ప్రక్రియల మీద కూడా ఆయన దృష్టి నిలిచింది. అందులో ప్రయోగాలు చేసేడు.

**కథన ప్రక్రియ :** కథ చెప్పడం ఇందులో ముఖ్యం. సంఘటనల పరంపరకు ఇందులో స్థానం ఉంది. ఇది రామాయణ - భారతాలంత పెద్దది కావచ్చును. ''పూజారి వారి కోడలు తాజారగ బిందెజారి దబ్బున పడియెన్'' అన్నంత చిన్నదీకావచ్చును.

గురజాడ రచనల్లో పూర్ణమ్మ కథ - కన్యక - డామనుపితియసు - లవణరాజు కల కథనాత్మకమైనవి. పూర్ణమ్మ కథను Literary Ballad అనవచ్చును. 13వ శతాబ్దికి Ballad పాశ్చాత్య సంప్రదాయంలో కనిపిస్తుంది. మనకు 13వ శతాబ్ది నుండి జక్కుల పురంధ్రి ఉంది. సహజంగా ఇది జానపద సంప్రదాయానికి, ఆశు సంప్రదాయానికి చెందినది. తరానికి తరానికి అనుశ్రుతిగా వ్యాపించే కథలివి. కథ ఈ ప్రక్రియకు గుండెకాయ. తరానికి తరానికి ఈ ప్రక్రియలో స్వల్పమైన మార్పు లేర్పడవచ్చును. అతీతశక్తులు- జానపదగాధలు- రాజ్య చరిత్రలు- వంశ చరిత్రలు- కుటుంబగాధలలోని సంఘటనలు వస్తువులుగా ఇవి రూపొందుతాయి. ప్రసిద్ధ యుద్ధాలు ప్రముఖపోటీలు ప్రేమగాథలు ఇందులో ఉంటాయి. కథకుడి ఆత్మీయత ఇందులో ఉండదు. నిష్పక్షపాతవైఖరితో గానం చేస్తాడు. ఇది కేవలం శ్రవ్య ప్రక్రియ కాబట్టి ఇందులో లయకు బలమైన స్థానం ఉంది. అవస్థానుగుణంగా లయలో మార్పు ఉంటుంది. పదాలు సరళంగా ఉంటాయి. చిన్న పదాలుంటాయి. పద్యపాదాలు సంక్షిప్తంగా ఉండి సమలయను పాటిస్తాయి. సంచారగాయకులు వీటిని గానం చేస్తూ ఉంటారు. అందుచేత ఇందులో పాతకథలకు కొత్త రూపాలేర్పడవచ్చును. సొంతకథలు చేరవచ్చును. పాత్రల అనుభూతులను గాఢంగా అందించే ప్రయత్నంలో కొత్త వర్ణనలు చోటు చేసుకోవచ్చును. కొత్త తళతళలు కూర్చుకోవచ్చును. ఇందులో పల్లవి పునరావృతమౌతూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు పల్లవి మారుతూ ఉంటుంది. వంతపాట ఉంటుంది. ఈ జానపద వీరగాథల లక్షణాలు పుణికి పుచ్చుకుని ఆధునికంగా సాహిత్య వీరగాథలు (Literary Ballad) ఏర్పడ్డాయి.

పూర్ణమ్మకథ ఒక కుటుంబగాథ ఒక దయనీయ బాలిక వివాహగాథ. కరుణరసాత్మకమైనది. ఆ బాలిక వీరోచితమైన ఆత్మార్పణతో ఒక సామాజిక దురన్యాయానికి తెరవేయదలచిన గాథ ఇది. 'నలుగురు కూర్చొని నవ్వే వేళలనా పేరొకపరి తలవండి' అన్నపూర్ణమ్మ ప్రార్థనలో తనవంటి దయనీయ స్థితి ఇతర బాలికలకు కలుగకుండా నిరోధించే ప్రయత్నమే ఎక్కువగా కనిపిస్తుంది. ఈగాథ ''తల్లులగన్న పిల్లల్లారా! విన్నారమ్మా ఈ కథను'' అనే పల్లవి పునశ్చరణతో ఆరంభమయింది.

ముద్రణకు నోచుకున్నా ఇది ఆశు సంప్రదాయానికి చెందినరచనే 'పుత్తడి బొమ్మా! పూర్ణమ్మా' 'అమ్మలకమ్మా దుర్గమ్మా' ' ఇంటికి పూర్ణమ రాదాయె' అనే వాక్యాలు పునరావృత్తిని పొందేయి. సమాసాలు లేవు. కఠిన పదాలు లేవు. చిన్న చిన్న మాటలే ఉన్నాయి. పాటంతా లయభరితంగా ఉంది. ఆద్యంతం కరుణ రసభరితంగా ఉంది. మనపూర్వులు ఈ తరహా పాటను జక్కులపాట, ఏలపాట అంటారు. ఇంకా తందాన పదం అనికూడా అనవచ్చును. శ్రీశ్రీ అన్నట్లుగా ఇది విషాదాంత ఏకాంత నాటికగా అనిపించదు.[6] ఇందులోని నాటకీయత కోసం తిక్కన దాకా పోనవసరం లేదు. అది చాలా చాలా భిన్నమైన విషయం. బాలనాగమ్మకథ, దేశింగురాజుకథ - బొబ్బిలికథ వంటి ఈ రకమైన రచనల్లో భావశబలత పుష్కలంగా ఉంది. గురజాడ దీనిని కాచి వడపోసి సంక్షిప్త సుందరమైన శిల్ప సౌష్ఠవాన్ని సాధించి శ్రీశ్రీ చేత అలా అనిపించేడు.

'లవణరాజు కల' Mid summer Night's Dream లా కనబడుతుందన్నాడు శ్రీశ్రీ.[7] ఏదశలో అన్నాడో తెలియదకు. దీనిని గాథ (Myth) అనవచ్చును. ఇందులో నాటకీయత కొంత ఉంది. కాని దీని లక్ష్యం నాటకీయ నిర్వహణం కాదు. ఇది జ్ఞానవాసిష్ఠంలోని కథ అంటే పౌరాణిక మన్నమాట. అందులో కొన్నిపాత్రలతో కొంత కథ నడుస్తుంది. కథను కథగా చెప్పడమే అక్కడి ప్రయోజనం. గురజాడ పద్యంలో కథ ఒక మూసమాత్రమే. అందులో కథాక్రమం కంటె నాయకుడు సాధించే పరమార్థానికి ప్రాధాన్యం ఎక్కువ. మంచి చెడ్డలను వేరు చేయడము, వర్ణధర్మ మధర్మ ధర్మము అని ప్రకటించడం ఇందులో లవణరాజు చేసిన వీరకృత్యాలు. ఆయన ధర్మవీరుడు. నాయకుని వీర కృత్యాలను వర్ణించడం గాథా లక్షణాలలో ఒకటి. పౌరాణిక ప్రాధాన్యం కంటే దాని ననుసరించిన కల్పన ప్రధానంగా గల ఇలాంటి వస్తువును పాశ్చాత్యులు Myth అన్నారు. ఇందులో అనూహ్య, అసంభావ్య, అద్భుత ఘటనలకు స్థానం ఉంటుంది. ఇందులో Initiation Myth, Quest Myth అని రెండు రకాలున్నాయి. Initiation Myth లో యువకుడైన వీరపురుషుడు దుర్ఘటము, దుస్సాధ్యము అయిన కార్యసాధనకు పూనుకుని విజయాన్ని సాధించి మానవతా శిఖరాల నధిరోహిస్తాడు. ఆ ప్రయత్నంలో అతని సాహసౌదార్యాలు, ప్రతిభాపాటవాలు, జ్ఞానవిచక్షణలు వెల్లడౌతాయి. లవణరాజు కల ఎన్నిసార్లు చదివినా ఈ అంశమే వెల్లడి కాగలదు.

గాథా విమర్శలో ప్రాగ్రూపం (Archetype) అనే దాన్ని గ్రహిస్తారు. సామాజిక చైతన్యంలో దానికి సంబంధించిన అనాది ప్రతివు (Premordial imaga) నిలిచి ఉంటుందని యూంగ్ ప్రతిపాదించేడు[8]. అజ్ఞాతానికి సంబంధించిన ఈ దశను ఫ్రాయిడ్ వ్యక్తిచేతనలో చూస్తే, యూంగ్ సామాజిక చేతనలో చూసేడు. ఈ ప్రాగ్రూపాలు స్థలకాలావధుల్ని దాటి ప్రయాణిస్తాయి. ఇవి స్వప్నరూపంలో, మతరూపంలో, జానపద జీవనంలోని విభిన్నరీతులలో, సమకాలీన ప్రాపంచిక రూపాలలో, సాహిత్యంలో అభివ్యక్తిని సాధిస్తాయి. అసాధారణ ప్రజ్ఞగల పురాతన దార్శనికతలోంచి, అజ్ఞాత ప్రతిమల్ని జాగృతానుభవాలుగా కలలుగనే కవుల సామర్థ్యంలోంచి ఇవి సాహిత్య రూపాలుగా బహిర్గమిస్తాయి. అలాంటిదే 'లవణరాజుకల' ఇది జ్ఞానవాసిష్ఠం నుండి పరంపరగా అందివచ్చినగాథ. ఆ గాథకు అధునాతన అభ్యుదయ వ్యాఖ్యానరూపమే గురజాడ రచన. యుగయుగాలుగా సామాజిక

అంతశ్చేతనలో అణగి ఉన్న అభ్యుదయ పరిష్కారానికి ఈ విడుదలను గావించి అది తాను సాధించిన ఘనవిజయంగా జీవన చరమఘట్టంలో ''కొత్త మిన్కుల తెలివిపటిమను - మంచి చెడ్డల మార్చితిన్'' అని తృప్తిగా చెప్పుకున్నాడు. గురజాడ రూపుదిద్దిన మానవతావాదానికి పరిపూర్ణప్రతీక లవణరాజు. అతని కల తరతరాలుగా మానవజాతి కన్నకల. అందుకే అదినాకు Mid summer night's dream గా కనబడలేదు.

కన్యక' కథన రీతికి చెందిన రచన. ఇది జానపద సంప్రదాయానికి చెందినది. 'పూర్ణమ్మకథ' గురజాడ సృష్టి. ఇది అలాకాదు. ఇందులో కథనంతటిని కవి తానై చెప్పేడు. రాజు - సెట్టి - కన్యక చెప్పిన సంభాషణలు మాత్రం ఇందులో ఎక్కువగా ఉన్నాయి. అంతమాత్రంచేత ఇది నాటకీయ పద్ధతికి చెందిన రచన అని అనలేము. ఇందులో పాత్ర చిత్రణకు ప్రాధాన్యంలేదు. పాత్రల చలనాలన్నీ కవి నిర్దేశించిన రీతిలో కొనసాగేయి. ఇందులో వంత పాటలేదు. పూర్ణమ్మలోలా గతి వైవిధ్యం లేదు. ఈ రచన అంతా ఒకే లయలో కొనసాగింది. ఇందుకే గురజాడ దీనిని 'పదం' అన్నాడు. ఇప్పటికీ జానపదులు పదం పాడుకుంటూ ఉంటారు. ఇందులో ఒక్క గాయకుడికే స్థానం ఉంది. ''పదం - పద్యం పట్టి నిలిచెను కీర్తులపకీర్తులే'' అన్నమాటలో ఉన్నది ఆ స్ఫూర్తే. Literary Ballad కి, పదానికి గల భేదాన్ని చూపడానికి గురజాడ ఈరచన చేసాడనిపిస్తుంది.

పూర్ణమ్మకథ సమకాలీనమైనది. లవణరాజు కల పౌరాణికము. కన్యక జానపదరీతికి చెందినది. 'డామను పితియసు' విదేశీయమైనది. గ్రీకుకథ అందులో ప్రాంతీయత అనే గుణం లేదు. కాని ఈ అన్నింటిని మానవతా సూత్రంతో ముడివేసి చూపించదలచేడు. అందుకే ఈ కథనరీతిలో వైవిధ్యాన్ని ప్రదర్శించేడు. ''పొత్తులన్నవి సంపదలకే - ఆపదలకగునే'' అనే ప్రశ్నకు సమాధానంగా రాసిన ఒక గ్రీకు కథ 'డామను - పితియసు' గురజాడ రచనలో సామాజికాశం లేని కథ ఇది. ఇందులో లోకరీతి ఉంది. ఇది కథాకథనరీతికి చెందినదే. ఇందులో మూడు, నాలుగు సన్నివేశాలున్నాయి. ఆ సన్నివేశాల కనుగుణమైన సంభాషణలున్నాయి. కొంత పాత్ర లక్షణమున్నది. అంటే నాటకీయత కొంత ఉంది. కాని అంతకంటె ప్రస్ఫుటంగా కథన ధోరణి కనిపిస్తుంది. ''విద్య లెరుగని ప్రేమ భారము'' నిండిన కథ ఇది.

'ముత్యాల సరాలు' 'కాసులు' అనే రచనలు రెండూ నాటకీయ ప్రక్రియకు చెందినవి. కథనరీతిలో లాగ ఇందులో పరిపూర్ణమైన కథాంశం ఉండదు. సంఘటనల ప్రాబల్యంతో నిండిన ఒకటి రెండు దృశ్యాలుంటాయి. కవి దృష్టి అంతా పాత్ర చిత్రణమీద ఉంటుంది. ఒక వ్యక్తి తనస్వ్యూహంలోని ఉద్దేశ్యాలను - లక్ష్యాలను ఇతరులకు వెల్లడించేలా ప్రవర్తించడం ఇందులో ప్రధానం. కవి ఆ పాత్రలను సృష్టించి ఒక సన్నివేశంలో - సంఘర్షణాత్మకమైన లేదా క్రియాశీలమైన సన్నివేశంలో నిలుపుతాడు. అలాంటి ప్రాత్ర ఒకటి కావచ్చును. అంతకంటె ఎక్కువ కావచ్చును. అవేవీ కవి గొంతుతో పలకవు. వాటికి సొంతగొంతు ఉంటుంది. అయితే ఆ పాత్రల చర్యల పట్ల కవి దృక్పథం అనుకంప నుండి ప్రతిఘటన దాకా ఉండే వివిధ దశలలో ఎక్కడ నిలిచేది మాత్రం పద్యం స్పష్టం చేస్తుంది. నాటకీయ రచన మీద కవికి ఉండే అదుపు అంత మాత్రమే.

(సశేషం)



**ETCHING**

## చిత్రకారుడు : **గోకా అశోక్**

వీరు 1970లో నరసంపేట, వరంగల్‌లో జన్మించారు. అనేక విద్యాలయాల్లో చిత్ర కళాభ్యాసం చేశారు. 90, 92, 94, 95 లలో అనేక చోట్ల ఆయన చిత్రకళా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

లలితాకళా పరిషత్ అవార్డు, విశాఖపట్టణం 1992లో, విశిష్ట ఆచార్య పురస్కార్ అవార్డు 1993-97కు, నికేతన్ అవార్డు మద్రాసు 1996లో, ఇలా అనేక పురస్కారాలను అందుకొన్నారు. ఇంకా అనేక రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి అవార్డులను అందుకొన్నారు.

వీటిల్లో 91,94ల్లో ఆల్ ఇండియా ఆర్ట్స్ ఎగ్జిబిషన్ - హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ, 93లో సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నాగపూర్ వారి అవార్డులున్నాయి.

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



**A Young Man Holding a Skull**